సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
బుధవారం, 29.07.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 268
పేజీలు: 08 వెల: రూ. 5

## ఆగస్టు 3 వరకు వానలు

### ఏపీ, తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

### బంగాళాఖాతంలో అల్పపీడనం

04

- ఉరుములు, పిడుగులు ఉంటాయ్
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



## భారత్ సాహసోపేత

# అడుగు!

### కంభాట్ జలసంధిపై ప్రపంచంలోనే అతిపెద్ద మంచినీటి రిజర్వాయరు

- సౌరాష్ట్రకు శాశ్వత నీటి భద్రత కల్పించనున్న మెగా ప్రాజెక్టు
- సముద్ర జలసంధిని మంచినీటి సరస్సుగా మార్చనున్న భారత్
- నీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా కంభాట్ ప్రాజెక్టు
- భారత ఇంజినీరింగ్ ప్రతిభకు మరో అద్భుత నిదర్శనం
- సాగునీరు, తాగునీటికి భారీ ఊరటనివ్వనున్న ప్రాజెక్టు
- భవిష్యత్ నీటి భద్రతకు భారత్ వేస్తున్న చారిత్రక అడుగు

04







*సముద్రం అంటే ఉప్పునీరే కాదు... రేపటి భారత దాహాన్ని తీర్చే మహా మంచినీటి మహా సముద్రం! ప్రపంచ ఇంజినీరింగ్ చరిత్రలోనే కనువిని ఎరుగని రీతిలో, గుజరాత్‌లోని కంభాట్ జలసంధినే ఏకంగా ఒక భారీ ఆనకట్టతో మూసేసి... ప్రపంచంలోనే అత్యంత అతి పెద్ద మానవ నిర్మిత మంచినీటి రిజర్వాయర్‌గా మార్చేందుకు భారత్ సరికొత్త జల విప్లవానికి తెరలేపుతోంది! సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల దశాబ్దాల నీటి కష్టాలకు శాశ్వత చెక్ పెడుతూ, సముద్రాన్ని మంచినీటి కొలనుగా మార్చే ఈ సాహసోపేత ప్రాజెక్టు విజయవంతమైతే... ప్రపంచం భారత్ వైపు ముక్కున వేలేసుకుని చూడటం ఖాయం!*

ముద్ర డెస్క్:

## 89 కేసులతో

## తెలంగాణ సీఎం

# టాప్



### అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్

- సంపన్న సీఎంల జాబితాలో చంద్రబాబు సహా ముగ్గురు దక్షిణాది సీఎంలు
- ఏడీఆర్ నివేదికలో రేవంత్ రెడ్డికి అగ్రస్థానం
- నమోదైన కేసుల్లో అధికం రాజకీయ నిరసనలవే..
- 31 మంది సీఎంల అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ నివేదిక
- చంద్రబాబు, డీకేపై చెరో 19 క్రిమినల్ కేసులు
- మొత్తం 31 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులు



**ముద్ర డెస్క్:** దేశంలోని ముఖ్యమంత్రుల ఆస్తులు, క్రిమినల్ కేసులు, విద్యార్హతలు, వయస్సు వంటి వివరాలపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదిక దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా రూపొందించిన ఈ రిపోర్టులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు ప్రకటించిన ముఖ్యమంత్రిగా నిలిచారు. ఇక సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో దక్షిణాది రాష్ట్రాల నుంచే తొలి 3 స్థానాల్లో సీఎంలు నిలిచారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తొలి స్థానాన్ని దక్కించుకోగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో స్థానంలో నిలిచారు.

ఏడీఆర్ రిపోర్టు ప్రకారం దేశంలోని 28 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల ప్రకటిత ఆస్తుల మొత్తం విలువ రూ.3,660 కోట్లుగా ఉంది. ఇందులో ఒక్క కర్ణాటక సీఎం డీకే శివకుమార్ రూ.1,413 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు రూ.931 కోట్లతో రెండో స్థానంలో.. తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ రూ.648 కోట్లతో మూడో స్థానంలో నిలిచారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రూ.30 కోట్లకు పైగా ప్రకటిత ఆస్తులతో 8వ స్థానంలో ఉన్నారు.

అతి తక్కువ ఆస్తులు ప్రకటించిన ముఖ్యమంత్రుల జాబితాలో జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రూ.55 లక్షలతో తొలి స్థానంలో ఉండగా.. పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి రూ.85 లక్షలతో రెండో స్థానంలో.. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ సుమారు రూ. కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నివేదికలో ఎక్కువ చర్చకు దారితీసిన అంశం ముఖ్యమంత్రులపై నమోదైన క్రిమినల్ కేసులే. మొత్తం 31 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది.

ఇందులో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 89 కేసులతో అగ్రస్థానంలో నిలిచారు. రేవంత్ రెడ్డి తర్వాత పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై 29 కేసులు మిగతా 04లో



## శాంతియుత నిరసనపై ఇనుప లాఠీలా?

- జంతర్ మంతర్ ఘటనపై సుప్రీంకోర్టు సీరియస్
- పోలీసుల చర్యలపై సిట్ దర్యాప్తునకు ఆదేశం

02

## రైతుల కోసం ఉపాధిలో 10 కొత్త పనులు

- కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- రైతులకు ఉపాధి పెంచేలా కొత్త ప్రతిపాదనలు
- ఇందిరమ్మ ఇళ్లకు ఉపాధి హామీ అనుసంధానం

02




## హైడ్రా సంస్కరణ కాదు.. అరాచక సంస్థ

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

- ఫీజు రీయింబర్స్‌మెంట్, రాష్ట్ర అప్పులపై వివరణ
- కాజీపేట రైల్వే డివిజన్‌కు కేంద్రాన్ని కోరిన కేటీఆర్

03



## మా ప్రభుత్వం తెచ్చిన గొప్ప సంస్కరణ

# హైడ్రా




- ఎవరిని అధికారిగా నియమించాలనేది ప్రభుత్వ విచక్షణ
- ఆ అధికారాన్ని ప్రభుత్వం నుండి ఎవరూ గుంజుకోలేరు..!
- కోర్టులపై గౌరవం నమ్మకం ఉన్నాయి

**ముద్ర , హైదరాబాద్ :** హైడ్రా కమిషనర్ అంశంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో సీఎం మాట్లాడారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు మిగతా 04లో

## మోడీకి షాక్ ఇచ్చిన

# మెటా

### మోదీ వీడియో తొలగింపుతో కలకలం

- ఫేస్‌బుక్‌లో మోదీ వీడియో బ్లాక్
- మెటా చర్యపై రాజకీయ దుమారం
- మోదీ వీడియో బ్లాక్ ఘటనపై కేంద్రం సీరియస్
- మెటాకు నోటీసుల పరిశీలన
- టెక్నికల్ లోపమని వివరణ..
- కేంద్రం తదుపరి చర్యలపై ఉత్కంఠ



**ముద్ర, ఢిల్లీ:** నరేంద్ర మోడీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ కు నాయకుడు. గడచిన 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా పనిచేస్తున్న సేవకుడు. ఓటమి అనేది లేకుండా.. ఎన్ని అవరోధాలు ఎదురైనా సరే ఎదుర్కొంటు సమర్థవంతంగా పరిపాలన సాగిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో భారతదేశాన్ని సమున్నత స్థాయిలో నిలబెడుతున్నారు. విద్య.. వైద్యం. మౌలిక వసతులు.. ఇలా అన్ని రంగాలలో భారతదేశంలో అగ్రస్థానంలో నిలపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. నరేంద్ర మోడీ ఇంతటి స్థాయిలో భారతదేశానికి గుర్తింపు తీసుకురావడం కొన్ని దేశాలకు నచ్చడం లేదు.. అందువల్లే తెర వెనుక మిగతా 02లో

## హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలుచోట్ల ట్రాఫిక్‌జామ్

- రహదారులు జలమయం
- జోరుగా ట్రాఫిక్ జాం
- అత్యవసరమైతేనే బయటకు రావాలి: మంత్రి పొన్నం

02



- ప్రతి ఇంటికి 15 నిమిషాలు కేటాయించనున్న నేతలు
- సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించనున్న ప్రభుత్వం
- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కూటమి ప్రచారం
- ప్రజలతో మమేకం కావడమే కూటమి కొత్త వ్యూహం

## చంద్రబాబు మార్క్

# సుపరిపాలన

### 45 రోజుల పాటు ఇంటింటి ప్రచారానికి కూటమి సిద్ధం




**ముద్ర, అమరావతి:** ఏపీలో టీడీపీ కూటమి పాలన రెండేళ్లు పూర్తి చేసుకుంది. మరో మూడేళ్ల పాలన ఉంది. తొలి రెండేళ్ల కూటమి పాలనపై సంతృప్తి శాతం అధికంగా ఉంది. ఇదే స్ఫూర్తితో మిగతా మూడేళ్లు మంచి పాలన అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తుండడంతో.. కూటమి ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సీఎం చంద్రబాబు కూటమి పార్టీల శ్రేణులకు మిగతా 02లో

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 29.07.2026
www.mudranews.in | @mudranews



### షుగర్ వల్ల కాళ్లు, చేతుల్లో తిమ్మిరి



"షుగర్ ఎక్కువకాలం నియంత్రణలో లేకపోతే మొదట కాళ్లు, చేతుల్లో తిమ్మిరి, మొద్దుబారిన భావన కనిపిస్తుంది. ఇది నరాలు దెబ్బతింటున్న సంకేతం కావచ్చు. ఇలాంటి లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి."

# మోడీకి షాక్ ఇచ్చిన మెటా

(మొదటి పేజీ తరువాయి)

కుట్రలకు పాల్పడుతున్నాయి. దేశంలో అల్లకల్లోలం సృష్టించడానికి దుర్మార్గాలకు పాల్పడుతున్నాయి.. ఇటీవల కాలంలో మనదేశంలో జరిగిన ఘటనలు.. దాని వెనుక ఉన్న విదేశీ శక్తులను తెరపైకి తీసుకురావడానికి మన దేశంలో ఉన్న దర్యాప్తు సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. విదేశీ శక్తులకు కొంత మంది మనదేశంలో ఉన్నవారు వత్తాసు పలుకుతున్నారు. ఆ సంస్థల లక్ష్యాలకు తగ్గట్టుగా మనదేశంలో పనిచేస్తున్నారు. మనదేశంలో కుట్రలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ చీకటి శక్తుల అసలు రూపాలను బయటికి తీసుకురావడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. మనదేశ ప్రతిష్టను.. మన దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడానికి విదేశీ సంస్థలు ఎన్నో రకాలుగా కుట్రలకు పాల్పడుతూనే ఉన్నాయి. తాజాగా నరేంద్ర మోడీ లక్ష్యంగా మెటా కంపెనీ చేసిన కుట్ర బయటికి వచ్చింది.




మెటా కంపెనీ ఫేస్బుక్ కు మాతృ సంస్థగా ఉంది. ఈ ఫేస్బుక్లో భారత ప్రధానికి వ్యక్తిగత ఖాతా ఉంది. ఈ ఖాతాను కోట్లాదిమంది అనుసరిస్తూ ఉంటారు. ఇటీవల ప్రధానమంత్రి జన్ – జీ తరాన్ని ఉద్దేశించి సెల్ఫీ వీడియోలను పోస్ట్ చేశారు. ఆ వీడియోలకు విశేషమైన స్పందన లభించింది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పోస్ట్ చేసిన ఒక వీడియోను మెటా కంపెనీ బ్లాక్ చేసింది. ఆ తర్వాత వెంటనే రీ పోస్ట్ చేసింది. దీనిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. టెక్నికల్ సమస్య వల్ల ఇలా జరిగిందని కంపెనీ ప్రకటించింది. దీనిపై కేంద్రం సీరియస్ గా ఉంది. మెటా కంపెనీకి నోటీసులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా విశేషమైన ఆదరణ పొందిన రాజకీయ నాయకులలో నరేంద్ర మోడీ ముందు వరుసలో ఉంటారు. ఈయనకు ఫేస్బుక్లో కోట్లాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. ఈ స్థాయిలో విశేషమైన ప్రాచుర్యం పొందిన నరేంద్ర మోడీ స్థాయిని తగ్గించడానికి మెటా కంపెనీ కుట్ర చేసిందని బిజెపి నాయకులు ఆరోపిస్తున్నారు. అందువల్లే నరేంద్ర మోడీ వీడియోను బ్లాక్ లో పెట్టిందని.. ఆ తర్వాత మళ్లీ రీ స్టోర్ చేసిందని గుర్తు చేస్తున్నారు. మెటా కంపెనీ తీరు భారత ప్రధానమంత్రి గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని.. ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదని బిజెపి నేతలు అంటున్నారు. దీనిపై కేంద్రం నోటీసులు పంపించే ఆలోచన చేస్తుందని సమాచారం. దీనికి మెటా కంపెనీ ఏవిధంగా బదులిస్తుందో చూడాలి.

# శాంతియుత నిరసనపై ఇనుప లాఠీలా?



**ముద్ర ఢిల్లీ:** నీట్ వ్యతిరేక ఆందోళనల సమయంలో చోటుచేసుకున్న విద్యార్థుల అరెస్టుల వ్యవహారంలో సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుల్లో అరెస్టయిన వారిలో మైనర్లు, నేరాభియోగాలు లేనివారిని వెంటనే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఇక, నిరసనల సమయంలో పోలీసుల చర్యలకు సంబంధించి వస్తోన్న ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని ధర్మాసనం స్పష్టం చేసింది. నీట్ –యూజీ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల వ్యవస్థలో అక్రమాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జి, బాష్పవాయువు గోళాలను ప్రయోగించారంటూ దాఖలైన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఆందోళనకారుల అరెస్టులపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. 18 ఏళ్ల లోపు విద్యార్థులు, నేర చరిత్ర లేని వారిని విడుదల చేయాలని ధర్మాసనం ఆదేశించింది. నిరసనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్లపై ఢిల్లీ ప్రభుత్వం దర్యాప్తు కొనసాగించవచ్చని ధర్మాసనం తెలిపింది. కానీ, విద్యార్థులపై ఎలాంటి తక్షణ, కఠిన చర్యలు తీసుకోవద్దని సూచించింది. అయితే, నేరాభియోగాలున్న ఆందోళనకారులకు ఈ ఉత్తర్వులు వర్తించవని స్పష్టం చేసింది.

**దర్యాప్తునకు ఉన్నతస్థాయి కమిటీ..**

'విద్యార్థుల నిరసనల సమయంలో పోలీసులపై అనేక ఆరోపణలు వచ్చాయి. పోలీసుల చర్యల కారణంగా మహిళలు, న్యాయవాదులు, మీడియా వ్యక్తులు గాయపడినట్లు కథనాలు వస్తున్నాయి. ఈ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు ఎందుకు చేయకూడదు? దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనల నిర్వహణ, పోలీసుల చర్యలకు సంబంధించి ఏకరూప మార్గదర్శకాలు రూపొందించాలి. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే.. వారిని విచారించి శిక్షించాలి'' అని ధర్మాసనం వెల్లడించింది. ఇక, 250 మంది పోలీసులపై ఆందోళనకారులు దాడి చేసినట్లు వచ్చిన నివేదికలపైనా దర్యాప్తు జరగాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ దాడులు చేసింది విద్యార్థులా లేదా నేరగాళ్లా అన్నది తేల్చాలని పేర్కొంది. ఈ అంశాలపై స్వతంత్ర, పారదర్శక దర్యాప్తునకు కమిటీ ఏర్పాటు చేస్తామని న్యాయస్థానం వెల్లడించింది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్లు, ఇతర వివరాలను భద్రపర్చాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ డిజిటల్ డేటాను పబ్లిక్ డొమైన్లోకి తీసుకురావద్దని స్పష్టం చేసింది.

# చంద్రబాబు మార్క్ సుపరిపాలన



(మొదటి పేజీ తరువాయి)

దిశా నిర్దేశం చేశారు. ఇటీవల వర్చువల్ విధానంలో ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలతో ఆయన చర్చించారు. ప్రతి ఇంటికి వెళ్లాలని పార్టీ నేతలకు ఆయన తేల్చి చెప్పారు. ప్రతి ఇంట్లో ఎంతమందికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయో.. జాబితాను తీసుకొని మరీ వివరించాలన్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే వివాదాలు, వాగ్వాదాలకు అవకాశం ఇవ్వకుండా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలని కూడా ఆదేశించారు.

**ప్రతి ఇంటికి 15 నిమిషాలు..**

సెప్టెంబర్ నుంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం చూస్తోంది. అందుకే 45 రోజుల ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది. కూటమి నేతలు ప్రతి ఇంటికి 15 నిమిషాల చొప్పున సమయం కేటాయించాలని కూడా చంద్రబాబు ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని పుస్తకాలు లేదా కరపత్రాలతో వివరించనున్నారు. ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించాలని.. ఎవరైనా ఇబ్బందులను ప్రస్తావిస్తే వాటిని పరిష్కరించేందుకు వీలుగా వినతి పత్రాలు తీసుకోవాలని కూడా సూచించడం విశేషం. కూటమి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధిని ప్రజలకు వివరించాలనే ప్రయత్నంలో భాగమే ఈ కార్యక్రమం.

**సంక్షేమంతో పాటు అభివృద్ధి గురించి..**

ఏపీలో కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. పెద్ద ఎత్తున ప్రజలకు మౌలిక వసతులను కూడా కల్పిస్తోంది. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో పురోగతి.. పెద్ద ఎత్తున పెట్టుబడుల సాధన, విశాఖలో ఐటీ పరిశ్రమల ఏర్పాటు, రాయలసీమలో తయారీ రంగ పరిశ్రమలు, మరోవైపు కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, మారిన రోడ్ల రూపురేఖలు.. ఇలా ప్రతి అంశాన్ని కూటమినేతలు ప్రజలకు వివరించే ప్రయత్నం చేయనున్నారు. ప్రభుత్వం ఏం చేసిందనే దానిపై ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తోంది.

**ప్రజలను నచ్చించి ఒప్పించి..**

ప్రజలను ఒప్పించడం ద్వారా.. వారికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమంతో పాటు అభివృద్ధిని చెప్పడం ద్వారా.. వారి అభిమానాన్ని చూరగొనాలని ప్రయత్నంలో ఉంది కూటమి ప్రభుత్వం. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని.. పార్టీ క్యాడర్ కు, నాయకత్వానికి ప్రజలతో మమేకం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా చేపట్టనుంది. ఇప్పటికే 45 రోజుల ప్రచార కార్యక్రమం ప్రారంభం అయింది. ఇది ముగిసిన మరుక్షణం స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ముందుగా మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని చూస్తోంది ప్రభుత్వం. పట్టణ ప్రాంతాల్లో ఉన్న సానుకూలతను అంచనా వేసుకుని ఈ నిర్ణయానికి వచ్చింది. తరువాత ప్రాదేశిక ఎన్నికలకు.. చివరిగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తోంది. మరి కూటమి ప్రభుత్వం చేసే ఈ ప్రయత్నం ఎంత వరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.



# సీజేపీ నేతల డ్యాన్స్‌లు నెటిజన్ల ఫైర్!

**ముద్ర, ఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా కోసం పోరాటం చేసి ఫలితం సాధించిన సీజేపీ సభ్యులు మంత్రి రాజీనామా విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వెకిలి చేష్టలతో విమర్శలపాలయ్యారు. తాజాగా ఢిల్లీలో హోటల్‌లో వేడుక జరుపుకున్నారు. ఆ వేడుకలో డాన్స్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

**ప్రాణ త్యాగాలను మరిచి..**

పోరాడి ఏదైనా సాధించిన తర్వాత కలిసి ఆనందం పంచుకోవడం సహజ ధోరణి. రోడ్డు మీద నిరసనలు, కష్టాలు అనుభవించిన తర్వాత ఒక చోట కలిసి విశ్రాంతి తీసుకోవడం, సంబరాలు చేసుకోవడం సాధారణం. అయితే ఆ వేడుకలో డాన్స్ వీడియోలు బయటకు రావడంతో నీట్ లీక్‌తో ప్రాణ త్యాగం చేసిన విద్యార్థులను మర్చిపోయి సంబరాలు చేసుకుంటూ డ్యాన్స చేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**నెటిజన్ల ఆగ్రహం..**

సీజేపీ నేతల డ్యాన్సులపై నెటిజన్లు ప్రధానంగా ఒక ప్రశ్నను లేవనెత్తారు. చనిపోయిన, గాయపడిన విద్యార్థులను మరిచిపోయారా? పోరాటం వెనుక ఉన్న నష్టాలు, బాధలు ఇంకా తాజాగా ఉన్న సమయంలో వేడుకలు, డాన్స్‌లు జరపడం అవసరమా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు పోరాటాన్ని గౌరవించినా, ఆ తర్వాతి ప్రవర్తనపై ప్రశ్నలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**లైట్ తీసుకున్న సీజేపీ ప్రతినిధి..**

సీజేపీ నేతల డ్యాన్స్‌పై వస్తున్న విమర్శలపై ఆ పార్టీ ప్రతినిధి సౌరవ్ స్పందించారు. పోరాటం చేస్తూ ఉండగలం, అలాగే సాధారణంగా కలిసి ఆనందం పంచుకోగలం అని అన్నారు. ఇది రెండు వైపులా సమతుల్యతను చూపించే ప్రయత్నం చేశారు.

ఈ ఘటన పోరాట సంస్థలు విజయం సాధించిన తర్వాత ఎలా ప్రవర్తించాలో చూపిస్తుంది. ఆనందం సహజమే అయినా, బాధితులు, నష్టపోయినవారి గురించి జ్ఞాపకం ఉంచుకోవడం ముఖ్యం. సోషల్ మీడియా యుగంలో ప్రతి చర్య వేగంగా బయటకు వస్తుంది కాబట్టి, సున్నితత్వం మరింత అవసరం.

# రైతుల కోసం ఉపాధి హామీలో 10 కొత్త పనులు

**ముద్ర, హైదరాబాద్:**

కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమ అంశాలపై చర్చించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) 2.0 పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని, దీనివల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకమైన వీబీ–జీ రామ్–జీ జాబితాలో మరికొన్ని అదనపు పనులను చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం కోరారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతుల జీవనోపాధిని దెబ్బతినకుండా కాపాడేందుకు 10 కొత్త రకాల పనులను ఉపాధి హామీ కింద నిర్వహించేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.



ఇందులో భాగంగా కూరగాయల పందిళ్ల నిర్మాణం, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటల పెంపకం, పట్టుపురుగుల షెడ్ల ఏర్పాటు వంటి వ్యవసాయ అనుబంధ పనులకు ఆమోదం తెలపాలని ప్రతిపాదించారు.

దీంతో పాటు రైతుల సొంత భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ చర్యలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న సాగుభూముల పునరుద్ధరణ పనులకు ఉపాధి హామీ పథకంలో అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కూడా ఈ పథకం జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఇండ్ల నిర్మాణంలో భాగమయ్యే లబ్ధిదారులకు కనీసం 90 రోజుల పాటు పని కల్పించి, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచవచ్చని సీఎం కేంద్ర మంత్రికి సమగ్రంగా వివరించారు.

# వచ్చేస్తోంది పాలిమర్ కరెన్సీ

**ముద్ర ఢిల్లీ:** దేశంలో రూ.10, రూ.20 డినామినేషన్‌లలో పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. 2012లోనే ఈ ఆలోచన చేసినా.. అనేక అవాంతరాలతో అమలు కాలేదు. తాజాగా ఆర్‌బీఐ పాలిమర్ కరెన్సీ ముద్రించాలని నిర్ణయించింది. దీంతో చాలా మందిలో ఇప్పటికే చలామణిలో ఉన్న కాగితపు నోట్లు రద్దు అవుతాయా ఇప్పటికే చలామణిలో ఉన్న కాగితపు నోట్లు రద్దు అవుతాయా ఒక సందేహం ఏర్పడింది. దీనికి కేంద్రం వివరణ ఇచ్చింది. కొత్త నోట్లు వచ్చినంత మాత్రాన పాతవి రద్దు చేయమని స్పష్టం చేసింది. రెండు రకాల నోట్లు కలిసి మార్కెట్‌లో ఉంటాయని తెలిపింది.

**పాత కరెన్సీకి ఇబ్బంది లేదు..**

కొత్త పాలిమర్ నోట్ల ప్రవేశం పాత కాగితపు నోట్ల స్థానాన్ని పూర్తిగా భర్తీ చేసేది కాదు. ప్రస్తుతం చలామణిలో ఉన్న నోట్లు కొనసాగుతాయి. ప్రజలు తమ దగ్గర ఉన్న కాగితపు నోట్లను ఏ మార్పు లేకుండా ఉపయోగించవచ్చు. రెండు రకాల నోట్లు ఏకకాలంలో మార్కెట్‌లో ఉండటంతో ఎలాంటి గందరగోళం లేదా అసౌకర్యం కలగదు. ఇది సాధారణంగా కరెన్సీ మార్పులలో జరిగే దశలవారీ విధానమే.

**పాలిమర్ నోట్లను ఎందుకు?**

నోట్ల మన్నిక పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం పాలిమర్ నోట్లు ముద్రించాలని నిర్ణయించింది. కాగితపు నోట్లు త్వరగా చిరిగిపోతాయి, మురికి పడతాయి, నీటికి లేదా వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేవు. పాలిమర్ మెటీరియల్‌తో తయారైన నోట్లు ఎక్కువ కాలం నిలుస్తాయి. దీని వల్ల ముద్రణ ఖర్చు తగ్గుతుంది, నోట్లు తరచుగా మార్చాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది దీర్ఘకాలిక ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలకు దారి తీస్తుంది.

**గతంలో సాంకేతిక అడ్డంకులు**

2012లోనే ఇలాంటి ప్రయత్నం జరిగింది. అయితే సాంకేతిక కారణాలతో అప్పుడు అమలు కాలేదు. ఇప్పుడు సాంకేతికత అభివృద్ధి చెందడంతో, అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధం కావడంతో ఈ నిర్ణయం మళ్లీ ముందుకు వచ్చింది. గత అనుభవాల నుంచి నేర్చుకుని జాగ్రత్తగా కేంద్రం అడుగులు వేస్తోంది.

ప్రస్తుతం చేతిలో ఉన్న కాగితపు నోట్లను మార్చాల్సిన అవసరం లేదు. రెండు రకాల నోట్లు చెల్లుబాటు అవుతాయి. కొత్త నోట్లు క్రమంగా మార్కెట్‌లోకి వస్తాయి. దీనివల్ల ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదా భయాందోళనలు అవసరం లేదు. ప్రభుత్వం స్పష్టంగా చెప్పినట్టు, ఇది భర్తీ కాకుండా అదనపు ఎంపికగా వస్తోంది.




# హైదరాబాద్‌లో భారీ వర్షం

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గం, మణికొండ, హైటెక్‌సిటీ, మాదాపూర్, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, నాచారం, కాప్రా తదితర ప్రాంతాల్లో భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. హైటెక్‌సిటీ, మాదాపూర్, మియపూర్, చందానగర్‌తో పాటు మలక్‌పేట, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

**అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు: మంత్రి పొన్నం**

వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్, సీపీతో ఫోన్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మ్యాన్‌హోల్‌ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని.. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

భారీగా వర్షపునీరు నిలిచిన ప్రాంతాల్లో ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పర్యటించారు. లక్డీకాపూల్, అయోధ్య జంక్షన్, మాసబ్ ట్యాంక్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నీరు నిలిపోయిన ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.

# అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్‌లో పెద్ది

**ముద్ర, హైదరాబాద్:**

బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా రక్తప్రసరణ వ్యవస్థ కుప్పకూలి ఆయన షాక్‌కు గురైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. క్రిటికల్ కేర్, పల్మనరీ, కార్డియాక్, న్యూరాలజీ విభాగాలకు చెందిన వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. మెకానికల్ వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతున్నప్పటికీ, కనీస సపోర్ట్‌తో శ్వాస సంబంధిత పరిస్థితి, వైటల్స్ స్థిరంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి న్యూరాలజికల్ స్పందన లేదన్నారు. మెదడుకు ఆక్సిజన్ అందకపోవడంతో జరిగిన నష్టాన్ని సూచించే లక్షణాలు ఈఈజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో కనిపించినట్లు వైద్యులు తెలిపారు. న్యూరాలజికల్, భవిష్యత్ ఆరోగ్యస్థితిపై మరింత స్పష్టత కోసం బుధవారం మరో మారు పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నట్లు యశోద వైద్యులు తెలిపారు.

### షుగర్ వల్ల మంట, నొప్పి

"పాదాల్లో మంట, కాలుతున్నట్లుగా అనిపించడం లేదా రాత్రివేళల్లో తీవ్రమైన నొప్పి రావడం కూడా డయాబెటిక్ న్యూరోపతి లక్షణాలే. ఇవి రోజువారీ జీవితాన్ని ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది."



# ఇకపై ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు

**- సీఎం రేవంత్ రెడ్డి**

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇకపై ఏటా చెల్లిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ బకాయిల సమస్య ఉండదన్నారు. ఢిల్లీలో మీడియాతో సీఎం మాట్లాడారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోంది. బీఆర్ఎస్ హయాంలో బకాయిలు పెట్టిన రీయింబర్స్‌మెంట్ రూ.8వేల కోట్లు భారంగా మారింది. వాటిని మేం ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ అంశంపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఆ పార్టీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారు. ఆర్.కృష్ణయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీలో బకాయిలపై ఆయన మాట్లాడరు. ఆ రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది..



అక్కడి బకాయిలపై స్పందించి ఆ తర్వాత తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుంది.

**గ్లోబరీనా తరహా సంస్థలపై కఠిన చర్యలు**

ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణతో సమస్యలు వస్తున్నాయి. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోంది. యూనివర్సిటీలపై ఆధిపత్యం చెలాయించేందుకు యత్నిస్తోంది. విద్య.. వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి.

కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నాడు గ్లోబరీనా లాంటి సంస్థలు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయి. నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారు. గ్లోబరీనా తరహా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలోనూ దానికి సంబంధించిన చట్టాలు రూపొందిస్తాం'' అని రేవంత్ అన్నారు.

# హైడ్రా సంస్కరణ కాదు.. అరాచక సంస్థ..

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**
**- ఫీజు రీయింబర్స్‌మెంట్, రాష్ట్ర అప్పులపై వివరణ**
**-కాజీపేట రైల్వే డివిజన్‌కు కేంద్రాన్ని కోరిన కేటీఆర్**
**- ఉద్యోగాలపై మోదీ, కాంగ్రెస్‌లను ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత**

**ముద్ర, హైదరాబాద్ :** హైడ్రా వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వేదికగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి కేసులు పెట్టేది, దాడులు చేసేది తమపైనేనని మండిపడ్డారు. బండి సంజయ్ కొడుకును రేవంత్ రెడ్డి కాపాడారని, ఎవరికి ఎవరు రహస్య మిత్రులో ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంపై ఎంత ఒత్తిడి తెచ్చినా రేవంత్ రెడ్డితో తాము నిరంతరం తలపడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

**హైడ్రా ఒక బ్లాక్‌మెయిల్ టూల్..**

హైడ్రా అనేది సంస్కరణ కాదని, అదొక అరాచక సంస్థ అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బిల్డర్లను బ్లాక్‌మెయిల్ చేయడానికి, ఆర్ఆర్ టాక్స్ పేరుతో డబ్బులు గుంజడానికి రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక టూల్‌లా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వసూలు చేస్తున్న ఈ డబ్బులు చివరకు బిఆర్ఎస్ , కాంగ్రెస్ ఖాతాలకే వెళ్తున్నాయని విమర్శించారు. సీఎం సోదరుడి ఇల్లు, ఇతర మంత్రుల ఇళ్లు చెరువుల్లో ఉన్నప్పటికీ వాటిని ముట్టడం లేదని, కేవలం పేదలనే హైడ్రా టార్గెట్ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అన్నదమ్ములే పెద్ద కబ్జాకోరులని, భూమిని భూహారతిగా మింగేస్తున్నారని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని,



చట్టానికి ఎవరూ మినహాయింపు కాకూడదని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి తెచ్చే ప్రతి స్కీమ్ వెనుక ఒక స్కామ్ ఉంటుందని, తాము అధికారంలోకి వచ్చాక హైడ్రాను బంగాళాఖాతంలో పడేస్తామని తేల్చి చెప్పారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్, అప్పులపై స్పష్టత**

2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా గత ప్రభుత్వాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. ఆనాడు తాము రూ. 72 వేల కోట్ల అప్పులతో పాలన మొదలుపెట్టి, రూ. 2 లక్షల కోట్ల వరకు అప్పు చేశామని, అయితే దానికి తగ్గట్టుగానే రాష్ట్రంలో ఆస్తులను కూడా భారీగా పెంచామని వివరించారు. కొత్తగా భవనాలు లేదా ఇళ్లు ఏవీ నిర్మించకుండా, కేవలం పేర్లు మార్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని ఎద్దేవా చేశారు.

**కేంద్ర మంత్రితో భేటీ – రైల్వే, ఐటీ రంగాల వినతులు**

రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రజల బాగుగోళ్లే తమకు ముఖ్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. సౌత్ రైల్వే జోన్ పునర్విభజనలో భాగంగా వరంగల్ ప్రజల సుదీర్ఘ కోరిక అయిన కాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే హైదరాబాద్–కరీంనగర్ (మనోహరాబాద్ –కొత్తపల్లి) లైన్‌లో సిద్దిపేట వరకు రైల్వే లైన్ పూర్తయిందని, మిగిలిన 75 కిలోమీటర్ల లైన్‌ను త్వరగా పూర్తి చేయాలని విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహాయ నిరాకరణ వల్లే ఈ పనులు ఆగాయని, ఈ ప్రాధాన్యత గల లైన్‌కు నిధులు ఇవ్వాలని కోరారు. దీనితో పాటు సిరిసిల్ల, వేములవాడ రైల్వే స్టేషన్లను 'అమృత్ స్టేషన్లు'గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.

ఐటీ రంగం అభివృద్ధి గురించి మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో ద్వితీయ శ్రేణి నగరాల్లోని 10 ప్రాంతాల్లో నిర్మించిన ఐటీ హబ్‌లు నేడు కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల భూత్ బంగ్లాల్లా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో ఐటీ ఉద్యోగాల వృద్ధి మందగించిందని, తమ పాలన ముగిసేనాటికి ఉన్న ఉద్యోగాల్లో దాదాపు 7,000 ఉద్యోగాలు తగ్గాయని తెలిపారు. వరంగల్‌లో 'ఇండియా AI డేటా సెంటర్', కరీంనగర్ , ఖమ్మంలో సైబర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు వెల్లడించారు.

**దేశవ్యాప్త యువత నిరాశ, ఉద్యోగాలపై ప్రశ్నలు**

ఏ రాజకీయ పార్టీ అండ లేకుండా దేశంలో యువత తిరుగుబాటు జెండా ఎగురవేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, మరి గత 12 ఏళ్లలో రావాల్సిన 24 కోట్ల ఉద్యోగాలు ఎక్కడపోయాయని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ తీవ్ర అసమర్థత వల్లే యువత ఆందోళనలను సరిగ్గా అడ్రస్ చేయలేకపోయిందని, ఆన్‌లైన్‌లో మొదలైన ఉద్యమం చివరికి ఉద్రిక్తంగా మారిందని అన్నారు. దేశంలోని యువతలో ప్రస్తుతం తీవ్ర నిరాశా నిస్పృహలు నిండి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన మహిళా భక్తులు

**కనకదుర్గమ్మకు ఘనంగా ఆషాఢ సారెలు సమర్పణ**





**ముద్ర, విజయవాడ:** ఆషాఢ మాస శాకంభరి ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయానికి మహిళా భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అమ్మవారిని తమ ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, సారెలతో భక్తిశ్రద్ధలతో సారె సమర్పిస్తున్నారు. ఆషాఢ సారె ఉత్సవాల 15వ రోజు అయిన బుధవారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సారె బృందాలు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాయి. దేవస్థానం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 32 సారె బృందాలు ఆలయానికి చేరుకోగా, ఆయా బృందాల్లోని 16,890 మంది భక్తులు సారె సమర్పణలో పాల్గొన్నారు. సారె బృందాలకు దేవస్థానం ప్రత్యేకంగా ఉచిత దర్శనం కల్పించడంతో పాటు, అమ్మవారి ప్రసాదమైన కదంభంను అందజేసింది. శాకంభరి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా తెలంగాణ

*** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**
*** స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులకు అభినందనలు**



**ముద్ర, ఢిల్లీ:** అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భారతదేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్–క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్–1ను విజయవంతంగా ప్రయోగించిన తీరును వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధన–అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వం—ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారు సాధించిన విజయం భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతుందని ప్రశంసించారు.

## శాసనసభ కమిటీల తొలి సమావేశం..

**- సమర్థవంతమైన పనితీరుపై స్పీకర్, మంత్రి శ్రీధర్ బాబు దిశానిర్దేశం**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో మంగళవారం శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ (అష్యూరెన్సెస్), నియమాల కమిటీ (రూల్స్), నైతిక విలువల కమిటీ (ఎథిక్స్)ల తొలి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ప్రభుత్వ హామీల అమలు కమిటీ సమావేశానికి చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి అధ్యక్షత వహించగా, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణ పాల్గొన్నారు. రూల్స్ కమిటీ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చైర్మన్‌గా వ్యవహరించగా, సభ్యులు దానం నాగేందర్, తూడి మేఘారెడ్డి, భూక్యా మురళి నాయక్ హాజరయ్యారు. ఎథిక్స్ కమిటీ సమావేశానికి చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షత వహించగా, సభ్యుడు జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి కూడా సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, ఎథిక్స్ కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కమిటీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, ప్రభుత్వం సభలో ఇచ్చిన హామీల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించడం హామీల కమిటీ బాధ్యత అని అన్నారు. రూల్స్ కమిటీ శాసనసభను సక్రమంగా, సమర్థవంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.శాసనసభ సభ్యుల ప్రవర్తన, నిబద్ధత, వ్యవహారశైలి ద్వారానే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం పెరుగుతుందని స్పీకర్ పేర్కొన్నారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కమిటీల చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభలో సభ్యులకు మొదట అందించే పుస్తకం రూల్స్ బుక్ అని, దానికి అనుగుణంగానే సభ నిర్వహణ జరుగుతుందని చెప్పారు. సభలో నియమ నిబంధనల అమలుతో పాటు శాసనసభ హుందాతనాన్ని కాపాడడంలో ఎథిక్స్ కమిటీ కీలక పాత్ర పోషించాలని, కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా ఉండి తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలా పనిచేయాలని ఆకాంక్షించారు.కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ, శాసనసభ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని, సభ గౌరవాన్ని మరింత పెంచే విధంగా పనిచేస్తామని తెలిపారు.

## శ్రీశైలంలోనూ ఆన్‌లైన్ ప్రోటోకాల్ దర్శన టికెట్లు



**ముద్ర, శ్రీశైలం :** శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఛైర్మన్ రమేశ్ నాయుడు అధ్వర్యంలో సమావేశమైన సభ్యుల కమిటీ 39 అంశాలకు ఆమోదం తెలిపింది. శ్రీశైలం దేవస్థానం ప్రొటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు చేపట్టినట్లు ఛైర్మన్ వెల్లడించారు. వచ్చే నెల 15 నుంచి తిరుమల తరహాలో శ్రీశైలంలోనూ ఆన్‌లైన్ ప్రొటోకాల్ టికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో శ్రీశైలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు చెప్పారు.

## విద్యార్థులపై పోలీసుల తీరు సరికాదు: ప్రియాంకా గాంధీ

**ముద్ర, హైదరాబాద్:** యాంటీ–పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ వినియోగించడాన్ని, లాఠీఛార్జి చేయడాన్ని తప్పుబట్టారు. ఆయుధాలు ప్రయోగించడానికి వారేమైనా ఉగ్రవాదులా అని ప్రశ్నించారు. విద్యార్థుల మీద పోలీసుల దౌర్జన్యంపై ప్రధాని మోదీ.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశయువత తమ ప్రజాస్వామ్య హక్కులను శాంతియుతంగా వినియోగించుకుంటుండగా.. వారిపై దాడి చేయడం సరైన చర్య కాదన్నారు. విద్యార్థుల నిరసనను ఆయుధాలతో అణచివేయాలని పోలీసులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. పేపర్ లీక్‌ల కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రుల బాధ ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు.

# భారీ వర్షాలు: ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. నగరంలో నెలకొన్న పరిస్థితులను మంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఆకస్మికంగా కురిసిన వర్షాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ముఖ్యంగా రాజ్‌భవన్ రోడ్,



సోమాజిగూడ, ప్రజాభవన్ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన నీటి నిల్వలను సిబ్బంది వేగంగా తొలగించినట్లు తెలిపారు.

కృష్ణానగర్ ప్రాంతంలో ఎత్తైన ప్రాంతాల నుంచి భారీగా వర్షపు నీరు రోడ్లపైకి రావడంతో కొంతమేర ఇబ్బందులు తలెత్తినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం రాజేంద్రనగర్, శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో వర్షం కొనసాగుతోందని, మరో రెండు గంటల పాటు వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, హైడ్రా బృందాలు పూర్తి అప్రమత్తతతో సమన్వయంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మ్యాన్‌హోల్‌ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, జీహెచ్ఎంసీ, హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు వీలైనంత వరకు బయటకు రావద్దని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడుతోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 29.07.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## చిన్న నిర్లక్ష్యం..
# పెద్ద ప్రమాదం



డా. మహమ్మద్ హసన్,
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్ : 9908059234

నేను తరుచుగా తరగతి గదిలో పిల్లల్ని అకాడమిక్ ఇయర్ గురించి, దాని విలువ గురించి పదే పదే గుర్తు చేస్తూ ఉంటాను. అయినా పిల్లలు నా మాటల్ని పెడచెవిన పెట్టి సెమిస్టర్లలో అరడజనుకు పైగా పేపర్లు బ్యాక్స్ ఉంచి నిరాశతో మళ్ళీ మళ్ళీ పరీక్షలు రాస్తూ ఉంటారు. తరగతి గదిలో ఉన్నప్పుడే ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లు భవిష్యత్తులో చేయకుండా ఉంటే అకాడమిక్ పరంగా వెనుకబాటుతనం, ఎన్నో పోటీ పరీక్షలు, ఉద్యోగాల నోటిఫికేషన్లు వచ్చినా డిగ్రీలో పాస్ కాక పోతే వాటికి అర్హత లేనట్లే కదా? కాబట్టి మీ లక్ష్యం ఏదైనా కావొచ్చు దాని గురించి మీకు అవగాహన లేకపోతే మీ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. అలాగే కొద్ది మంది ఏదైనా వ్యాపారాన్ని లేదా సంస్థను ప్రారంభించి దాని మీద కోట్లు పెట్టుబడి పెట్టి ఎలాంటి ప్రణాళికలు లేకుండా ఏదో సంస్థను నడిపిస్తున్నాము అన్నట్లుగా ఉంటారు. అది ప్రారంభించడానికి ముందే అలాంటి సంస్థను నడిపే వారి వద్ద సలహాలు, సూచనలు, క్షేత్రపర్యటనలు, సమాజంలో ఆ సంస్థ నుండి వస్తున్న వస్తువులకు డిమాండ్ మొదలైనవి తెలుసుకుంటే బాగుంటుంది. లేనిపక్షంలో అనుభవలేమితో చేసే పని ఏదైనా నష్టం కలిగించవచ్చు. ఒకవేళ నష్టం వస్తున్నట్లుగా తెలిస్తే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి లేనిపక్షంలో కోట్లతో ప్రా రంభమైన వ్యాపారం త్వరలోనే ముగియవచ్చు. వ్యాపారమైన చదువైనా మేథో పరంగా చేసే పనులే. వాటిలో అశ్రద్ధ చేస్తే ఎలా ఉంటుందో అలా నిర్లక్ష్యం చేసే వారికి సంబంధించిన ఓ కథను చదవండి.

ఒక రాజ్యంలో ఇద్దరు నావికులు ఉండేవారు. ఇద్దరు పడవలతో బయలుదేరుతారు. ప్రయాణం ప్రారంభించిన కొద్ది సేపటికే రెండు పడవలకు రంధ్రాలు అవుతాయి. మొదటి నావికుడు దానిని గమనించి "రంధ్రం" చిన్నదే అయినప్పటికీ అశ్రద్ధ చేస్తే ప్రాణాల మీదకి వస్తుందని వెంటనే దానిని (రంధ్రం) పడవను కొద్దిసేపటి వరకు ఆపివేసి ఆ రంధ్రంలో చిన్న చిన్న చెక్క ముక్కలు మరియు జిగురుతో ఆ రంధ్రాన్ని పూడ్చివేసి మళ్ళీ తన ప్రయాణాన్ని ప్రారంభించి ముందుకు కదిలాడు పడవతో. రెండవ నావికుడు మాత్రం పడవకు అయిన రంధ్రం చూసి చిన్నదే కదా, పైగా ఇప్పుడే ప్రారంభం అయింది. నీరు కూడా పడవలోకి కొంచమే వస్తుంది. పెద్ద ప్రమాదమేమి లేదనుకొని "లక్ష్యం" ఎలాగు దగ్గర్లోనే ఉంది కదా అనుకొని రంధ్రం నుండి వస్తున్న నీటిని పట్టించుకోకుండా పడవను అలాగే నడపసాగాడు. కానీ నిమిష నిమిషానికి అలల ధాటికి పడవలోకి నీరు రావడం మొదలైంది. కొద్ది క్షణాలలోనే పడవలోకి నీరు పెద్ద మొత్తంలో చేరింది. అది చూసి భయపడిన నావికుడు ఆ నీరు మొత్తాన్ని బయటికి తోడివేయడానికి ఎంతగా కష్టపడాల్సి వచ్చిందంటే పడవను నడపటం కష్ట సాధ్యమైంది.

చివరికి పడవ నడి సముద్రంలో మునిగిపోయింది. దీని ద్వారా మనం తెలుసుకోవలసిన నీతి ఏమిటంటే సమస్యలు అకస్మాత్తుగా వచ్చినా అవి ప్రారంభంలో చిన్నగానే కనిపిస్తాయి. మనం చేసే నిర్లక్ష్యం, అశ్రద్ధ వల్ల రోజు రోజుకి పెరిగి పెద్దవై ప్రాణాల మీదకు వచ్చేంత తీవ్రతను పెంచుతాము. మనం చాలా కాలం పాటు సమస్యలు ఏవైనా చిన్నవిగానే చూస్తాము. కానీ అవి రాను రాను మనపై మానసికంగా ఒత్తిడిని కలుగజేస్తాయి. పరీక్షలకు ఇంకా నాలుగు నెలల సమయం ఉందని ప్రతీరోజు అశ్రద్ధ చేస్తే నాలులు నెలలు మీ కళ్ళ ముందే హారతి కర్పూరం లాగా కాల గర్భంలోకి వెళ్ళిపోతాయి. తీరా పరీక్ష తేది దగ్గరపడ్డాక మీరు నష్ట నివారణ చర్యలు ప్రారంభిస్తే ఎలాంటి "ప్రయోజనం" ఉండదు. అప్పటికప్పుడు మీరు పుస్తకంతో కుస్తీ పట్టినా అది మీ మస్తకంలోకి (మెదడులోకి) చేరదు. కారణం మీపై ఉన్న "ఒత్తిడి", "భయం" మూలంగా మీరు చదివినదంతా గజిబిజిగా మీ మెదడులోకి చేరుతుంది. ఫలితం ఫలితాలలో మీ నంబర్ మిస్సింగ్. ఎవరైతే సమస్యను ప్రారంభంలోనే పసిగట్టి దానిని నివారించుకుంటాడో అతడే భవిష్యత్తులో "సక్సెస్" అవుతాడు. ఎవరైతే ఏమీ కాదులే అని నిర్లక్ష్యంగా "కాలయాపన" చేస్తారో వారే వారి అతి పెద్ద ప్రమాదాన్ని స్వయంగా కొని తెచ్చుకుంటారు. నిజమే కదా!.

సముద్రాన్ని చూస్తే ఉప్పునీరు మాత్రమే గుర్తుకు వస్తుంది. దాన్ని శుద్ధి చేసి తాగునీటిగా మార్చే డీసాలినేషన్ ప్లాంట్లు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. కానీ ఒక సముద్రపు జలసంధినే ఆనకట్టతో మూసివేసి, దాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద మంచి నీటి రిజర్వాయరుగా మార్చే ఆలోచన ఎంతమందికి వస్తుంది? అదే ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడానికి భారత్ సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని కంభాట్ జలసంధిపై ప్రతిపాదించిన ఈ మహత్తర ప్రాజెక్టు విజయవంతమైతే, ఇది భారత ఇంజినీరింగ్ ప్రతిభకు ప్రపంచ వేదికపై కొత్త గుర్తింపును తీసుకురానుంది.




# భారత్ సాహసం!

గుజరాత్‌లోని భావ్‌నగర్ నుంచి భారుచ్ వరకు కంభాట్ జలసంధిపై భారీ బ్యారేజ్ నిర్మించి, సముద్రపు ఉప్పునీటి ప్రవాహాన్ని నియంత్రించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. అనంతరం నర్మద, మహి, సబర్మతి, ధాధర్ వంటి నదుల ద్వారా వచ్చే మంచినీటిని నిల్వ చేసి, ఆ ప్రాంతాన్ని విశాలమైన మంచి నీటి సరస్సుగా మార్చే ప్రణాళిక రూపొందించారు. ఇది అమలైతే ప్రపంచంలోనే అతిపెద్ద మానవ నిర్మిత మంచినీటి నిల్వ కేంద్రంగా అవతరించే అవకాశం ఉంది.

ఈ ప్రాజెక్టు వెనుక ఉన్న అసలు అవసరం గుజరాత్‌లోని నీటి అసమానత. రాష్ట్రంలోని దక్షిణ, మధ్య గుజరాత్ ప్రాంతాలకు సగటున అధిక వర్షపాతం లభిస్తుంది. కానీ సౌరాష్ట్ర, కచ్, ఉత్తర గుజరాత్ ప్రాంతాలు దశాబ్దాలుగా నీటి కొరతతో సతమతమవుతున్నాయి. రాష్ట్ర విస్తీర్ణంలో సుమారు 42 శాతం ఉన్న సౌరాష్ట్రకు నీటి వనరులు కేవలం 16 శాతం మాత్రమే ఉన్నాయి. కచ్, ఉత్తర గుజరాత్ కలిపి మూడో వంతు భూభాగం ఉన్నప్పటికీ నీటి లభ్యత అత్యల్పంగా ఉంది. ఈ అసమానతను తగ్గించడానికి కంభాట్ ప్రాజెక్టు కీలక పరిష్కారంగా భావిస్తున్నారు.

ఈ ప్రాజెక్టు వల్ల తాగునీరు మాత్రమే కాదు, వ్యవసాయానికి సాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరా కూడా గణనీయంగా పెరుగుతుంది. భూగర్భ జలాలపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుంది. వేలాది గ్రామాలకు శాశ్వత నీటి భద్రత లభించే అవకాశం ఉంది. సౌరాష్ట్రలో వ్యవసాయం స్థిరపడటంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులు పెరిగే అవకాశమూ ఉంది. నీటి కొరత కారణంగా వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి దిశగా అడుగులు వేయగలవు.

ఇలాంటి భారీ ప్రాజెక్టులు కేవలం నీటి నిల్వకే పరిమితం కావు. రహదారులు, రైల్వేలు, విద్యుత్ ఉత్పత్తి, మత్స్య సంపద, పర్యాటకం వంటి అనేక రంగాలకు ఇవి ఊతమిస్తాయి. కంభాట్ బ్యారేజ్ కూడా గుజరాత్‌లో రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు తీర ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గించే అవకాశాన్ని కల్పిస్తుంది. భవిష్యత్తులో ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త ఇంధనంగా మారవచ్చు.

అయితే ఇంత భారీ ప్రాజెక్టుకు సవాళ్లు కూడా తక్కువ కావు. సముద్ర జీవవైవిధ్యంపై ప్రభావం, ఉప్పునీటి ప్రవాహంలో మార్పులు, మత్స్యకారుల జీవనోపాధి, తీరప్రాంత పర్యావరణ సమతుల్యత వంటి అంశాలను అత్యంత శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.




పర్యావరణ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ, దీర్ఘకాల నిర్వహణ వంటి అంశాల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటి మధ్య సమతుల్యతే ఈ ప్రాజెక్టు విజయాన్ని నిర్ణయిస్తుంది.

ప్రపంచంలో భారీ ఆనకట్టలు, కాలువలు నిర్మించిన దేశంగా భారత్‌కు ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు ఉంది. సర్దార్ సరోవర్, భాక్రా నంగల్, తేహ్రీ వంటి ప్రాజెక్టులు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు కంభాట్ జలసంధిని ప్రపంచంలోనే అతిపెద్ద మంచి నీటి రిజర్వాయరుగా మార్చే ప్రయత్నం కూడా విజయవంతమైతే, అది భారత ఇంజినీరింగ్ సామర్థ్యానికి మరో అద్భుత నిదర్శనంగా నిలుస్తుంది.

నీరు భవిష్యత్తు ప్రపంచంలో అత్యంత విలువైన సహజ వనరుగా మారబోతోంది. అలాంటి సమయంలో ప్రతి చుక్కను భద్రపరచడం, సమర్థంగా వినియోగించడం దేశాల అభివృద్ధిని నిర్ణయించే అంశం గా మారింది. కంభాట్ ప్రాజెక్టు కేవలం ఒక ఆనకట్ట నిర్మాణం కాదు; నీటి భద్రత, ప్రాంతీయ సమాన అభివృద్ధి, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్ చేపడుతున్న సాహసోపేత జల విప్లవం. అన్ని సాంకేతిక, పర్యావరణ, సామాజిక సవాళ్లను అధిగమించి ఈ ప్రాజెక్టు పూర్తి అయితే, ప్రపంచం మరోసారి భారత వైపు ఆశ్చర్యంగా చూసే రోజు ఎంతో దూరంలో ఉండకపోవచ్చు.

# కృషి ఉంటే అఖిలేష్ అవుతారు..
## మన తెలుగు సాధారణ కుర్రాడికి రూ.1.06 కోట్ల ప్యాకేజీ..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం చాలా కష్టంగా మారింది. ఐటీ రంగంలో ఆర్థిక సంక్షోభం, మరో వైపు ఏఐ ప్రభావంతో ప్రైవేటు కొలువులకు కూడా గ్యారంటీ ఉండడం లేదు.



చాలా కంపెనీలు ఉద్యోగాలు కుదిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన మాల్తి అఖిలేష్ సూరంపాలెం అంతర్జాతీయ కంపెనీల్లో భారీ ప్యాకేజీతో కొలువు కొట్టాడు. ఆదిత్య యూనివర్సిటీలో బీటెక్ డేటా సైన్స్ చదువుతూ మే నెలలో జరిగిన క్యాంపస్ నియామకాల్లో ఏఐ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. కెనడా కేంద్రంగా పనిచేస్తున్న ఫ్రంటిక్ ఏఐ అతనికి సంవత్సరానికి రూ.1.06 కోట్ల ప్యాకేజీతో అవకాశం కల్పించింది. జూన్ 20న ఆఫర్ లెటర్ అందిన అఖిలేష్ ఇప్పటికే పూర్తిస్థాయి వర్క్–ఫ్రమ్–హోమ్ ఉద్యోగంలో చేరి పని చేస్తున్నారు. ప్రారంభ మూడు నుంచి ఆరు నెలల వరకు నెలకు రూ.30 వేల ఉపకార వేతనం అందుతుంది. ఆ తర్వాత పూర్తి ప్యాకేజీ అమల్లోకి వస్తుంది. అదే నియామకాల్లో మరో విద్యార్థి జి. రాజేశ్ కూడా దాదాపు సమాన ప్యాకేజీతో ఎంపికయ్యారు.

### కష్టజీవి కుటుంబం నుంచి..

గంగాధర్ రావు, దేవి దంపతుల కుమారుడు అఖిలేష్. తండ్రి వినికిడి, మాటల లోపం కారణంగా చదువు సాగలేదు. టైలరింగ్ వృత్తి ద్వారా కుటుంబ పోషణ చేస్తూ ఉన్నారు. తల్లి దుస్తులపై చేతి పనులు చేస్తూ ఆయనకు సహకరిస్తుంటారు. తమలాగే కొడుకు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని మంచి విద్య అందించాలని వారు కోరుకున్నారు. ఆ కోరికను నెరవేర్చాలని అఖిలేష్ చిన్నతనం నుంచే శ్రద్ధగా చదువుకున్నారు. 2020లో కొత్తపల్లిలోని వీవీఎస్ (ప్రైవేట్) పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. ఆ తర్వాత కాకినాడ నారాయణ జూనియర్ కళాశాలలో ఎంపీసీ విభాగంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ఆదిత్య యూనివర్సిటీలో డేటా సైన్స్ బీటెక్‌లో చేరారు. ప్రస్తుత ఏఐ ధోరణిని గుర్తించి ఆ రంగంలో అనేక ప్రాజెక్టులు రూపొందించి నైపుణ్యం పెంచుకున్నారు.

### నిరాశను అధిగమించి..

గతంలో రెండు–మూడు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నా ఉద్యోగం రాలేదు. అయినా నిరాశకు లోను కాకుండా లక్ష్యం వైపు ముందుకు సాగారు. మే నెల క్యాంపస్‌లో 243 మంది పాల్గొనగా అఖిలేష్‌తోపాటు మరో యువకుడు మాత్రమే ఈ అధిక ప్యాకేజీ అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. కొడుకు సాధించిన ఉన్నత స్థానంతో తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. గ్రామంలోనూ ఈ విజయం చర్చనీయాంశమైంది. ఏఐ రంగంలో నిపుణుడిగా ఎదిగి ఏఐ మాస్టర్ కావాలనేది అఖిలేష్ లక్ష్యం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించి ఈ అంతర్జాతీయ అవకాశాన్ని సాధించడం గ్రామీణ, పేద నేపథ్య విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## 89 కేసులతో సీఎం
# రేవంత్ టాప్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. కర్ణాట క సీఎం డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుపై చెరో 19 కేసులు నమోదైనట్లు ఈ నివేదిక పేర్కొంది. ఇద్దరు ముఖ్యమంత్రులపై హత్యాయత్నానికి సంబంధించిన కేసులు కూడా ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం రేవంత్ రెడ్డి ప్రకటించిన 89 కేసుల్లో ఎక్కువగా రాజ కీయ నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఎన్నికల ప్రచారా ల సమయంలో నమోదైనవేనని వివరాలు సూచిస్తున్నాయి. ఈ కేసుల్లో చాలా వరకు ప్రస్తుతం వివిధ కో ర్టుల్లో విచారణ దశలో ఉన్నాయి. కేసులు నమోదై ఉండటం మాత్రమే నేరం రుజువైనట్లు కాదని.. ఇవన్నీ అభ్యర్థులు ఎన్నికల అఫిడవిట్లలో స్వయంగా ప్రకటించిన వివరాలేనని ఏడీఆర్ తెలిపింది.



వయస్సు పరంగా చూస్తే 31 మంది ముఖ్యమంత్రుల్లో 17 మంది సీఎంలు.. 51 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు ఉన్నారని.. మరో 8 మంది 41 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్నారని ఈ నివేదిక తెలిపింది. మొత్తంగా చూస్తే సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు తొలి మూడు స్థానాలను కైవసం చేసుకోగా.. క్రిమినల్ కేసుల సంఖ్యలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో నిలవడం ఈ ఏడీఆర్ నివేదికలో ప్రధానంగా చర్చకు కారణమైంది.

## మా ప్రభుత్వం తెచ్చిన గొప్ప
# సంస్కరణ హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

కబ్జా చేశారని.. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించారన్నారు. పదెకరాలు కబ్జా చేస్తే కనక వర్షం కూడా కురిపించవచ్చని రేవంత్ ఎద్దేవా చేశారు. 'హైడ్రా.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణ. దీన్ని మరింత బలోపేతం చేస్తాం. హైడ్రా పనులను భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చారు.. అది పేదలదా? గండిపేట చెరువు ఆక్రమిస్తే నిర్మాణాలను కూల్చారు.. పేదలవా? కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. గతంలో సీఎస్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులున్నాయి. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అన్నారు.

# ఆగస్టు 3 వరకు వానల జోరు

**ముద్ర డెస్క్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారడంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఆగస్టు 3వ తేదీ వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, ఉరుములు, పిడుగులు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. దీనివల్ల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆది, సోమ వారాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. సంగారెడ్డిలో అత్యధికంగా 7.2, కామారెడ్డి జిల్లా నాగరెడ్డిపల్లిలో 6.9, వికారాబాద్ జిల్లా మొమిన్‌పేటలో 6.4, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో 6.3, మెదక్ జిల్లా శంకరంపేటలో 6.2, భద్రాద్రి జిల్లా జూలూరుపాడులో 4.73 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్న రైతులకు ఈ వర్షాలు కొంత ఊరటనిచ్చాయి. తాజాగా మరో 3 రోజులు వర్షాలు కురుస్తాయన్న ప్రకటనతో సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రంలో సగటున జూన్ నెలలో 13 సెంటీమీటర్లు, జూలైలో 22 సెంటీమీటర్ల వర్షం కురవాలి. గత ఏడాది ఇదే సమయానికి 33.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కానీ, ఈ ఏడాది తొలకరి నుంచే వానలు తక్కువగా పడుతున్నాయి. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో 10 సెంటీమీటర్లు, జూలైలో ఇప్పటివరకు 11 సెంటీమీటర్ల వర్షమే కురిసింది. మొత్తంగా రెండు నెలల్లో 10 సెం.మీ లోటు వర్షపాతం నమోదైంది. దాదాపుగా 26 జిల్లాల్లో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ములుగు, నాగర్కర్నూల్, కామారెడ్డి, మెదక్, నల్లగొండ, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లోనే సాధారణ వర్షపాతం రికార్డయింది.

**జూరాలకు 24వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్, భీమా నదిపై ఉన్న ఉజ్జయిని ప్రాజెక్టులు.. నిండుకుండలను తలపిస్తున్నాయి. ప్రస్తుతం ఆల్మట్టికి 73,461 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 20,500 క్యూసెక్కుల వరద వస్తుండగా... గేట్లను ఎత్తడం ద్వారా 14,125 క్యూసెక్కులు, జలవిద్యుదుత్పత్తికి 6వేలపైగా క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఉజ్జయిని ప్రాజెక్టుకు 69,492 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 3,695 క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర జలాశయానికి 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 3,695 క్యూసెక్కులను వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు సోమవారం 30,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. శ్రీశైలం డ్యామ్‌కు 163 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. నాగార్జునసాగర్‌కు 4,970 క్యూసెక్కులు వస్తోంది. ఇక, మహారాష్ట్రలోని నాసిక్‌లో కురుస్తున్న వర్షాలతో గోదావరిపై ఉన్న జైక్వాడి ప్రాజెక్టుకు సోమవారం 63,618 క్యూసెక్కుల వరద వచ్చింది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 29.07.2026
www.mudranews.in | @mudranews



**షుగర్ వల్ల స్పర్శ తగ్గిపోవడం**

"నరాలు దెబ్బతింటే పాదాలకు గాయమైనా వెంటనే తెలియకపోవచ్చు. చిన్న గాయాలు కూడా పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే ప్రతిరోజూ పాదాలను పరిశీలించడం చాలా ముఖ్యం."



# సీఎం ప్రజావాణిని సందర్శించిన మంత్రి పొన్నం

**325 దరఖాస్తుల స్వీకరణ**
**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక**

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సీఎం ప్రజావాణిని సందర్శించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ లతో కలిసి మంత్రి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సీఎం ప్రజావాణి కార్యక్రమం సజావుగా, విజయవంతంగా సాగుతోందని, అందుకు ఇంచార్జ్ చిన్నారెడ్డి ఓపిక ముఖ్య కారణం అని, సమర్థులైన అధికారుల బృందం బాగా పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కార వేదిక సీఎం ప్రజావాణి అని మంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీఎం ప్రజావాణిలోని వివిధ శాఖల డెస్క్ లను, ప్రవాసి ప్రజావాణిని మంత్రి సందర్శించారు. దుబాయిలో తెలంగాణ వాసులకు సేవా కార్యక్రమాలు అందిస్తూ అండగా నిలుస్తున్న సమాజ సేవకులు, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ కు చెందిన అబ్దుల్ కలీంను మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు




**325 దరఖాస్తులు**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 242వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 325 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 161, రెవెన్యూ శాఖకు సంబంధించి 38, బీసీ సంక్షేమ శాఖకు 28, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 96 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్ ఆర్ ఐ సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్ రావు, సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బసవేశ్వర సముదాయంపై కాషాయ జెండా



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని ఇందిరా చౌక్ లో గల బసవేశ్వర మహారాజ్ దుకాణ సముదాయం వద్ద హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ కాషాయ జెండాను ఆవిష్కరించి హిందూ ఐక్యతకు చిన్నంగా నిలిపారు. కాషాయ జెండా ధ్వజ స్తంభానికి పూజా కార్యక్రమం నిర్వహించి జైశ్రీరామ్, హిందూ హిందూ దేశ్ క బంధు, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ కాషాయ జెండా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో హిందూ సంఘ సభ్యులు నగరం మల్లేశం, మహేష్ సింగ్ ఠాగూర్, మోహన్, శశాంక్, ప్రశాంత్, రామ్ సాగర్, నారాయణ, ప్రకాష్, అవినాష్, విజయ్, నవీన్, శ్రీశైలం, దీపక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గౌతమ్ నగర్ డివిజన్‌లోని వాణి నగర్ ప్రాంతంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్‌ఓలు , బీఎల్ఏలు తో మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.అదేవిధంగా, బీఎల్‌ఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, వారికి తగిన వేతనాలు చెల్లించడంతో పాటు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలని ఫోన్ ద్వారా మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ శ్రీ మాను చౌదరి గారికి మరియు మల్కాజ్‌గిరి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానాకి విజ్ఞప్తి చేశారు.బీఎల్‌ఓలు ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నందున, వారికి అవసరమైన ప్రోత్సాహం, సౌకర్యాలు అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.




# సామాజిక న్యాయమే టీఆర్ఎస్ ధ్యేయం

**టీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి భవాని**

**ముద్ర, కుషాయిగూడ:** రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించడమే తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) ప్రధాన ధ్యేయమని టిఆర్ఎస్ మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన వేముల భవాని అన్నారు. తనపై విశ్వాసంతో టిఆర్ఎస్ మల్కాజ్గిరి పార్లమెంటు ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం కాప్రా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ స్థాపించిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. సామాజిక న్యాయంలో భాగంగా ఉచిత విద్య... ఉచిత వైద్యం..రైతును రాజుగా చూడడం.. యువతకు ఉద్యోగ అవకాశాలు... అన్ని వర్గాలకు సమన్యాయం అనే అజెండాతో తెలంగాణ రక్షణ సేన పాంచజన్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పార్టీ పదవుల్లో కూడా సామాజిక న్యాయంతో నియామకాలు చేసిన కవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. టిఆర్ఎస్ అధినేత్రి కవిత పాంచజన్య సూత్రాలే రానున్న రోజుల్లో ఆమెను ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.అంతకు ముందు ఆమె ఈసీఐఎల్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కవిత చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఉప్పల్ ఇంచార్జ్ శ్రమన్ దేవ్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు వల్లపు శివకుమార్, టిఆర్ఎస్ నాయకులు దికొండ కవిత చీర మహేష్,పద్మ రమాదేవి, జ్యోత్స్న, పద్మజ బాలకృష్ణ విజయలక్ష్మి,వంశీ, కృష్ణ, లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.




## వయోపరిమితి సమానంగా పెంచాలి

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల నేపథ్యంలో అన్ని వర్గాల అభ్యర్థులకు సమాన న్యాయం జరిగేలా వయోపరిమితి (ఏజ్ లిమిట్ ) పెంచాలని ఈబీసీ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో వేలాది మంది నిరుద్యోగులు వయోపరిమితి దాటే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో అన్ని వర్గాల అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించేలా వయోపరిమితిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలవుతున్న నేపథ్యంలో, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర అన్ని వర్గాల అభ్యర్థులకు సమానంగా వయోపరిమితి సడలింపు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనివల్ల ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకుని అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఈబీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది.



# సర్ ను ప్రతి పౌరుడు సద్వినియోగపరచుకోవాలి



**ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి**

**ముద్ర, కాప్రా:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నా మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిలుకానగర్ డివిజన్ ఇంచార్జ్ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, పోలింగ్ కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా బేతి సుభాష్ రెడ్డి ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలను కలిసి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్లకు అవగాహన కల్పించే అంశాలపై బీఎల్ఓలకు పలు విలువైన సూచనలు, సలహాలు అందించారు.చిలుకానగర్ డివిజన్ పరిధిలోని మర్రిచెట్టు ప్రాంత ప్రభుత్వ పాఠశాల, ఆదర్శనగర్ కాలనీలోని ఎన్ఎస్ గ్రామర్ స్కూల్, బోడ్రాయి ప్రాంతంలోని మహిళా భవన్, విజ్ఞాన్ గ్రామర్ స్కూల్‌కు సంబంధించిన పోలింగ్ బూత్‌లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఓటర్లను కలిసి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు బస్తీల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణకు ఎన్నికల సంఘం ఆగస్టు 3వ తేదీని చివరి గడువుగా నిర్ణయించిందని, గడువులోపు డివిజన్ పరిధిలోని అర్హులైన ప్రజలందరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్ఓలకు తిరిగి సమర్పించాలని సూచించారు.ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా సమర్పించని ఓటర్లను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందించి ఫారాల సమర్పణ ప్రక్రియను పూర్తి చేయాలని డివిజన్ నాయకులకు బేతి సుభాష్ రెడ్డి సూచించారు.

## తెలంగాణ స్పోర్ట్స్ జర్నలిస్టుల జట్టుకు ఎంపీ ఈటల రాజేందర్ అభినందనలు



**ముద్ర, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తెలంగాణ స్పోర్ట్స్ జర్నలిస్టుల జట్టుకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.లయోలా కళాశాల వేదికగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొనగా, ఫైనల్లో తెలంగాణ జట్టు అద్భుత ప్రతిభ కనబర్చి విజేతగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు జర్నలిస్టుల మధ్య పరస్పర స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు.

## కార్మికుల సంక్షేమమే జనసేన ధ్యేయం



**ముద్ర, కూకట్పల్లి :** ఏవీబీ పురంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గత రెండు వారాలుగా నిర్వహించిన లేబర్ కార్డ్ మరియు ఈ–శ్రమ్ కార్డ్ నమోదు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు మరియు ఇతర కార్మికులకు కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ చేతుల మీదుగా కార్డులను అందజేశారు.ఈ సందర్భంగ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలు కార్మిక కుటుంబాలకు ఎంతో భరోసానిస్తాయని, ఆర్థిక రక్షణ కల్పిస్తాయని తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్మిక కుటుంబానికి జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భవన నిర్మాణ కార్మికులకు మరియు ఇతర శ్రామికులకు ఆయన భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, ఏవీబీ పురం జనసైనికులు టి. ప్రసాద్ రావు, వై. ధనుంజయ్, బి. రాము, జి. దుర్యోధన, డి. కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం




**ముద్ర, కూకట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేషంగా కృషి చేసిన మాజీ కేంద్ర మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి 8వ వర్ధంతి వేడుకలను బాలానగర్ వెంకటేశ్వర నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బండి రమేష్ మాట్లాడుతూ... జైపాల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో తనదైన శైలిలో బలంగా గళం విప్పారని కొనియాడారు. అపారమైన రాజకీయ అనుభవం, విశ్లేషణా సామర్థ్యంతో దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన నిజమైన ప్రజానాయకుడని అన్నారు. రాజకీయ చతురుడిగా, ట్రబుల్ షూటర్‌గా పేరుగాంచిన జైపాల్ రెడ్డి.. ఎంతటి క్లిష్ట సమస్య ఎదురైనా దానిని చాకచక్యంగా పరిష్కరించే నాయకుడని గుర్తుచేశారు.తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయిలో శక్తివంతంగా వినిపించడంలో, రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో జైపాల్ రెడ్డి పాత్ర ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఆయన అందించిన ప్రజాసేవ, పాటించిన రాజకీయ విలువలు, నిబద్ధత నేటి తరానికి ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జైపాల్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

## వ్యవసాయ రంగం బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

**తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి**




**ముద్ర ప్రతినిధి, తాండూరు:** వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు.మంగళవారం తాండూరు మండలం అంతారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడారు.తాండూరునియోజకవర్గంలోని వ్యవసాయ పరిస్థితులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతుల అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. త్వరలోనే ఇతర రంగాల వారు సైతం వ్యవసాయంలోకి అడుగుపెట్టే ఆస్కారం ఉందన్నారు. చిరుధాన్యాలలో సాగు చేస్తే రెట్టింపు ఆదాయం పొందవచ్చు అన్నారు.ఎల్‌నినో ప్రభావం వల్ల తక్కువ నీరు అవసరమయ్యే కంది, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలు పండించాలన్నారు. రైతులు ఆదాయం వచ్చే పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని సూచించారు ఆయిల్ ఫామ్ ద్వారా రైతులకు విరివిగా ఆదాయం లభిస్తుందన్నారు. రైతుల అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యమని అహర్నిశలు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసమేకృషిచేస్తుందన్నారు.అదేవిధంగా రైతు నేస్తం కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పలువురు ఆదర్శ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మి, డీఏఓ కవిత, ఏడీఏ అరుణ, ఏవో కొమురయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, కాంగ్రెస్ అధ్యక్షులు బాతుల నాగరాజ్, పార్టీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 29.07.2026
www.mudranews.in | @mudranews



**షుగర్ వల్ల కండరాల బలహీనత**

కాళ్ల కండరాలు బలహీనపడడం వల్ల నడవడంలో ఇబ్బందులు, సమతుల్యత కోల్పోయే పరిస్థితులు రావచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, అవసరమైతే ఫిజియోథెరపీ తీసుకోవడం మంచిది.



# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో అక్రమాలు..

**- ఇద్దరు కానిస్టేబుళ్లు, ఆర్ఎస్ఐ సస్పెన్షన్.!**




**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న ఆర్ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు వారిపై చర్యలు చేపట్టారు.

అందిన సమాచారం ప్రకారం.. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నుంచి తప్పించేందుకు వాహనదారుల నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. సుమారు 130 కేసుల్లో రూ.20 లక్షల వరకు అక్రమంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, కోర్టును కూడా తప్పుదారి పట్టించేలా అసలు నిందితుల స్థానంలో ఇతర వ్యక్తులను హాజరుపరిచారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణ నిర్వహించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై శాఖాపరమైన విచారణ కొనసాగుతోంది. పూర్తి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ప్రభుత్వ వైద్య సేవలను బలోపేతం చేయండి

**- మంత్రికి కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ వినతి**



**ముద్ర, కోరుట్ల :** కోరుట్ల నియోజకవర్గ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులను బదిలీ చేయకుండా కొనసాగించాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. వైద్యుల కొరత నేపథ్యంలో బదిలీలు జరిగితే ప్రజలకు వైద్యసేవలు మరింత దెబ్బతింటాయని వివరించారు. కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలు, ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ, ఆపరేషన్ థియేటర్, హైడ్రాలిక్ టేబుల్స్, ఓటీ ల్యాంపులు, జనరేటర్ వంటి సదుపాయాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వైద్యులు, స్పెషలిస్టులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకాలతో పాటు పారిశుద్ధ్య సిబ్బందిని కూడా పెంచాలని కోరారు.కోరుట్ల 100 పడకల ఏరియా ఆసుపత్రికి క్యాడర్ స్ట్రెంగ్త్ పెంపు, ప్రత్యేక అంబులెన్స్ మంజూరు, మెట్‌పల్లి 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కోరుట్ల ఆసుపత్రిలో సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ పైప్‌లైన్, రెండు బోర్‌వెల్లు, 17 ఆరోగ్య ఉపకేంద్ర భవనాల పూర్తి, మాధాపూర్‌లో కొత్త పీహెచ్‌సీ ఏర్పాటు ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు..

## 2019 మున్సిపల్ చట్టానికి సవరణలు అవసరం

**- వైద్యుల అంజన్ కుమార్**

**ముద్ర, హైదరాబాద్ :** 2019 మున్సిపల్ చట్టంలో ప్రజాప్రతినిధుల అధికారాలపై స్పష్టతతో పాటు పలు కీలక సవరణలు చేయాల్సిన అవసరం ఉందని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న ESCI ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్పొరేటర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సెల్ఫ్ అసెస్‌మెంట్ హౌస్ నంబర్ల కేటాయింపులో జరుగుతున్న అవకతవకలను అరికట్టేందుకు చట్టపరమైన మార్పులు అవసరమన్నారు. అలాగే ప్రజాప్రతినిధుల అధికారాలు, బాధ్యతలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కార్పొరేటర్ల పాత్ర అత్యంత కీలకమని, వారికి మరింత పరిపాలనా అధికారాలు కల్పిస్తే ప్రజలకు వేగవంతంగా సేవలు అందించే అవకాశం ఉంటుందని అంజన్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన కార్పొరేటర్లు, అధికారులు పాల్గొని పట్టణ పాలన, చట్టాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అవగాహన పొందారు.




## వరుణుడి కరుణ కోసం "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి పూజలు

**ముద్ర, కరీంనగర్ :** రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు సుభిక్షంగా ఉండాలని.. పాడిపంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షిస్తూ అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కొలువై ఉన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక నైవేద్యం తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వరుణ దేవుని అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతాంగం సంతోషంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. ప్రకృతి అనుకూలం గా ఉండటం, సకాలంలో వర్షాలు కురవడం రైతాంగానికి ఎంతో కీలకమని, అన్నదాతలు అభివృద్ధి చెందితేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. భక్తులు, ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సకాలంలో వర్షాలు కురిసి.. అన్నదాత ముఖంలో చిరునవ్వులు వెల్లివిరియాలని.. ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నిండాలని" అనే ఆకాంక్షతో ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, వివిఎన్ఆర్ ఫౌండేషన్ కార్యకర్తలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు




# ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి

**- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**
**- జోగిన్‌పెల్లిలో వీవో భవనం, అంగన్‌వాడీ కేంద్రం**
**- నిర్మాణ పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్....**
**- అభివృద్ధి పనులు నాణ్యతతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి**




**ముద్ర, కోరుట్ల :** సూపర్ ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకొని భూగర్భ జలాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "తెలంగాణ జలసిరి" కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం రోజు కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో "తెలంగాణ జలసిరి" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న ఫార్మ్‌పాండ్‌కు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం రీచార్జ్ బోర్‌వెల్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అలాగే గ్రామంలో చేపడుతున్న కమ్యూనిటీ సోక్‌పిట్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రతి వర్షపు నీటి బొట్టును భూగర్భంలోకి ఇంకించి నీటి నిల్వలను పెంచడం అత్యంత అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీ.బీ.జీ.ఆర్.ఏ.ఎం. నిధులతో గ్రామాల్లో ఫార్మ్‌పాండ్లు, సోక్‌పిట్లు, ఉట్టకుంటలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ పొలాల్లో ఫార్మ్‌పాండ్లు నిర్మించుకోని, వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందుబాటులో ఉండటంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరిగి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం కోరుట్ల మండలం జోగిన్‌పెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న వీవో భవనం, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండరాదని, నిర్మాణాలన్నీ నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడివో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను ప్రాధాన్యతగా తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్....**



**ముద్ర, కోరుట్ల :** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను, సర్పంచ్ లను ఆదేశించారు. మంగళవారం రోజు కోరుట్ల పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ లకు ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, గ్రామీణ పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీబీజీఆర్ ఏఎం నిధుల వినియోగంపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ప్రారంభమయ్యాయని, భవిష్యత్తులో జగిత్యాల జిల్లాలో కూడా ప్రత్యేక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని తెలిపారు. ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సుప్రీంకోర్టు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోందని, సుప్రీంకోర్టు తాజా తీర్పుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా, వాటి అమలుపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతి వారం అఫిడవిట్ సమర్పిస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో పొడి, తడి, ఎలక్ట్రానిక్, వైద్య వ్యర్థాలను నాలుగు రకాలుగా చెత్తను వర్గీకరించే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి చెత్తను వేర్వేరుగా అందించే అలవాటు ఏర్పడేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

నాలుగు రకాల వ్యర్థాల సేకరణ, నిర్వహణకు అవసరమైన డంపింగ్ ప్రదేశాలను జిల్లా యంత్రాంగం గుర్తిస్తోందని, వాటి సేకరణకు అవసరమైన సామగ్రిని గ్రామపంచాయతీలపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. నెల రోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తూ నిత్య చెత్త సేకరణ, చెత్త వర్గీకరణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వీబీజీఆర్ ఏఎం నిధులను కేవలం రహదారులు, డ్రైన్ల నిర్మాణానికే పరిమితం చేయకుండా గ్రామాలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చే పాఠశాల ప్రహరీ గోడలు, గ్రామపంచాయతీ భవనాలు, సైన్స్ ల్యాబ్ లు, ఇతర మౌలిక వసతులు, శాశ్వత భవనాల నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడివో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి**



**ముద్ర, చిగురుమామిడి :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికలలో నిర్వహించే విత్తన మేళా రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు కార్యక్రమాలను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి తాటిపెల్లి తాటిపెల్లి పున్నం చందర్ రెడ్డి తెలిపారు.మంగళవారం సుందరగిరి రైతు వేదికలో విత్తన మేళాను నిర్వహించారు.ఈ నెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎల్ నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ విత్తన మేళాలో పేసర్లు,కందులు,మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట సాగు చేయటం ద్వారా కలిగే లాభాలను రైతులకు తెలిపారు.ఆయిల్ ఫామ్ పంట సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగ శిరీష,వ్యవసాయ విస్తరణ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

## సస్పెన్షన్ కాదు.. శాశ్వత తొలగింపే శిక్ష

**నర్మెట్ట:** అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఇటీవల చేపడుతున్న దాడులు అభినందనీయమని ఆర్టీఐ కార్యకర్త మహ్మద్ తఫ్జీల్ అన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులను కేవలం సస్పెండ్ చేయడం కాకుండా, నేరం రుజువైతే ప్రభుత్వ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించేలా చట్టాలను కఠినతరం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు నేరుగా సేవలందించే శాఖల్లో ప్రత్యేక విజిలెన్స్‌ను బలోపేతం చేసి, అక్రమ ఆస్తులను జప్తు చేయాలని సూచించారు. నిజాయితీ అధికారులను ప్రోత్సహిస్తూ, అవినీతిపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వరంగల్ ఎంపీ, ఎమ్మెల్యే వినతి

ముద్ర, ఢిల్లీ : న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు ఎన్‌హెచ్–163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల లింకులను పూర్తి చేయాలని కోరారు. అలాగే సీఆర్ఐఎఫ్ 2025–26 కింద నర్సంపేట–నందిగామ రహదారి విస్తరణ, భట్టుపల్లి–హంటర్ రోడ్ అభివృద్ధి పనులకు ఆమోదం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 29.07.2026
www.mudranews.in | @mudranews



### షుగర్ వల్ల షుగర్ నియంత్రణ




డయాబెటిక్ న్యూరోపతిని నివారించాలంటే రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచడం అత్యంత ముఖ్యం. వైద్యులు సూచించిన మందులు, పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు.

# రుణాలు, పోస్టుల నియామకాల్లో భారీ అక్రమాలు

**– విజిలెన్స్ విచారణకు బీఆర్ఎస్ డిమాండ్**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** జిల్లాలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద మంజూరు చేసే రుణాలు, పాఠశాల విద్యారంగంలో ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టుల నియామకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని అక్రమాలపై తక్షణమే విజిలెన్స్ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన PMEGP పథకాన్ని జిల్లాలోని కొందరు దళారులు, రాజకీయ నాయకులు బ్యాంక్ అధికారులు కలిసి పక్కదారి పట్టించారని ఆరోపించారు. సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో దాదాపు 90 శాతానికి పైగా ఎలాంటి యూనిట్లు స్థాపించకుండానే రూ. 10 కోట్లకు పైగా రుణ సబ్సిడీలను బినామీల పేరిట బదిలీ చేసుకున్నారని తెలుస్తోందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన, జియో ట్యాగింగ్ నిబంధనలను పక్కన పెట్టి దళారులతో కుమ్మక్కైన జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులు పెద్ద ఎత్తున ఈ రుణాలు మంజూరు చేశారని చెప్పారు. నిజమైన అర్హత కలిగిన ఎస్ సి, ఎస్ టి, బిసి మహిళా అభ్యర్థులకు బ్యాంకు లోన్లు ఇవ్వకుండా వేధిస్తుంటే, పైరవీకారులకు మాత్రం సబ్సిడీలు క్షణాల్లో విడుదలవుతున్నాయన్నారు. ఈ కుంభకోణంపై జిల్లా కలెక్టర్ వెంటనే విజిలెన్స్ విచారణ కమిటీని నియమించాలని, అక్రమాలకు పాల్పడిన సత్తుపల్లి బ్రాంచ్ మేనేజర్ సహా బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖ నిబంధనల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులను ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా విద్యా అర్హతల ఆధారంగా మాత్రమే భర్తీ చేయాల్సి ఉండగా ఖమ్మం జిల్లాలో విద్యాశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా 30 మార్కులు ఇంటర్వ్యూలకు, ఆయా పోస్టులకు 50 మార్కులు ఇంటర్వ్యూలకు కేటాయిస్తూ కొత్త మార్గదర్శకాలు రూపొందించారని ఆరోపించారు. ఉన్నత విద్యార్హతలు ఉన్న మెరిట్ అభ్యర్థులను పక్కనపెట్టి, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యేల ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ నియామకాలకు పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా భర్తీ చేసిన 114 పోస్టుల అభ్యర్థుల మెరిట్ జాబితా, ఇంటర్వ్యూలలో వేసిన మార్కుల వివరాలను పారదర్శకంగా జిల్లా నోటీస్ బోర్డులో, మండల పరిధిలో పబ్లిక్ డొమైన్‌లో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులైన నిరుద్యోగ యువతకు, అర్హులైన అభ్యర్థులకు బిఆర్ఎస్ పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని, అవసరమైతే జిల్లా కలెక్టర్‌ను కలిసి బాధితుల ఆధారాలతో నిలదీస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు ఉప్పల వెంకటరమణ, బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమల రావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, యలమద్ది రవి, బలుసు మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో రాహుల్ ఫ్లాప్ షో.. తెలంగాణలో రేవంత్ వైఫల్యాలు

**పొంగులేటి సుధాకర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపడుతున్న నిరసనలు రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు చేస్తున్న బూటకపు డ్రామాలేనని బీజేపీ జాతీయ నాయకుడు, కర్ణాటక–తమిళనాడు రాష్ట్రాల ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి విమర్శించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో దొంగ ఓట్లు తొలగిపోతున్నాయనే భయంతోనే కాంగ్రెస్ పార్టీ నిరాధార ఆరోపణలు చేస్తోందని ఆరోపించారు.ఖమ్మంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ, రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.జంతర్‌మంతర్ వేదికగా కాంగ్రెస్ చేపడుతున్న దీక్షలు, నిరసనలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కావని, కేవలం రాజకీయ ప్రచారం కోసమే నిర్వహిస్తున్న కార్యక్రమాలని అన్నారు. ప్రజల మద్దతు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ కెమెరాల ముందు కనిపించేందుకు మాత్రమే ఆందోళనలకు దిగుతోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశానికి ఉపయోగపడే ప్రత్యామ్నాయ విధానాలు లేవని, దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తోందని పొంగులేటి తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా నకిలీ, అక్రమ ఓటర్లు జాబితా నుంచి తొలగిపోతుండటంతో కాంగ్రెస్‌లో ఆందోళన మొదలైందన్నారు. దశాబ్దాలుగా కొనసాగిన దొంగ ఓట్ల వ్యవస్థకు చెక్ పడుతోందనే భయంతోనే ఎస్ఐఆర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. నిజమైన ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, ఖమ్మం జిల్లాలో దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని, ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తోందని అన్నారు.ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గోంగూర వెంకటేశ్వరరావు, రుద్ర ప్రదీప్, గుత్తా వెంకటేశ్వర్లు, నున్న రవికుమార్, శీలం పాపారావు, శాసనాల సాయిరాం, శ్యామ్ రాథోడ్, పమ్మీ అనిత, వీరవల్లి రాజేష్, కొనతం లక్ష్మీనారాయణ, మంద సరస్వతి, ఆర్వీఎస్ యాదవ్, బండ్ల రీగన్ ప్రతాప్, కుమిలి శ్రీనివాస్, తాజ్నూత్ భద్రం, గడీల నరేష్, నక్క రవి గౌడ్, వెంకటనారాయణ యాదవ్, పిట్టల వెంకట నరసయ్య, గుత్తా వంశీ తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా పవన్ కుమార్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** భారతీయ జనతా యువ మోర్చా భువనగిరి నూతన పట్టణ అధ్యక్షులుగా మామిడోజు పవన్ కుమార్ ని బిజెపి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం నియమించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండా గణేష్ కి, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు దయ్యాల కుమార స్వామికి బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ కి, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ కి, భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులకు హృదయ పూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఆర్డీఓ పద్మప్రియ**
**విద్యార్థులకు సురక్షిత తాగునీరు, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశం**



**ముద్ర, దేవరకొండ:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో సమర్థవంతంగా అమలు చేయాలని దేవరకొండ ఆర్డీఓ పద్మప్రియ అధికారులను ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జలసిరి పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆమె, ఇంకుడు గుంతలు, పంటకుంటలు, బోర్‌వెల్ రీఛార్జ్ పనులను విస్తృతంగా చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు.అనంతరం కొండమల్లేపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆర్డీఓ, విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి విద్యా ప్రమాణాలను మరింత పెంచాలని ఆమె సూచించారు.

# యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి

**బద్దం వాసుదేవ్ రెడ్డి**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చెయ్యాలని అసంబ్లీ అధ్యక్షులు బద్దం వాసు దేవ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని స్థానిక ఎస్ ఆర్ హోటల్ లో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఎగ్జిక్యూటివ్, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగష్టు 9 న నిర్వహించే యూత్ కాంగ్రెస్ ఫార్మేషన్ డే ను ప్రతి మండలంలో ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిగా జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్ రాష్ట్ర నాయకులు సురేష్, పుట్ట గిరీష్ ,అసెంబ్లీ ఉప అధ్యక్షులు చెగురి బాలకృష్ణ, బట్టు సందీప్, పూడిచెళ్ళ బాలు, అసంబ్లీ ప్రధాన కార్యదర్శులు ఉడుత కార్తీక్, కొంతం నవీన్ , బుగ ఉదయ్,గణేష్ రెడ్డి,గణేష్ యాదవ్, బీబీనగర్ మండల అధ్యక్షులు కొలను నిఖిల్ రెడ్డి, వొలిగుండ మండల అధ్యక్షులు మైసోల్ల ప్రవీణ్, పోచంపల్లి అధ్యక్షులు గారా సందీప్, మరియు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 30 న ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఔట్సోర్సింగ్ విధానంలో ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ కోసం జూలై 30న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖమ్మంలోని మెడికల్ సూపరింటెండెంట్ ఛాంబర్ లో వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. డి.ఫార్మసీ, లేదా బి.ఫార్మసీ అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన విద్యార్హతల సర్టిఫికెట్ లతో నిర్ణీత సమయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ జ్యూట్ బ్యాగుల ఆవిష్కరణ




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన పర్యావరణ సహిత జ్యూట్ బ్యాగులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ ను దూరంగా ఉంచాలని , పర్యావరణ సహిత జూట్ బ్యాగులను ప్రతి ఒక్కరూ వినియోగించాలని కోరారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను తయారు చేయించి అందరికీ పంపిణీ చేయడం అభినందనీయం అని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాల జ్యూట్ బ్యాగులను తయారు చేయించి అందరికీ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను విద్యార్థులు తెలుసుకుని ఆచరించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లైబ్రరీకి అధ్యయన పుస్తకాలు అందజేత



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల ప్రయోజనార్థం జేఈఈ మెయిన్స్ , జేఈఈ అడ్వాన్స్ ఐఐటీ ఇతర ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన విలువైన అధ్యయన పుస్తకాలను తుమ్మా గణేష్‌సాయి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు . ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా మాట్లాడుతూ ఐఐటీ ఢిల్లీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ( సి యస్ ఇ ) లో ప్రవేశం పొందిన తుమ్మా గణేష్‌సాయి తన విజయానికి ఉపయోగపడిన అధ్యయన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందించడం అభినందనీయమని తెలిపారు . జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల సేకరణను నిరంతరం విస్తరిస్తున్నామని , జేఈఈ , ఐఐటీ , ఎన్ఐటీ , ఐఐఐటీ తదితర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని చైర్మన్ పేర్కొన్నారు . ఉన్నత విద్యలో విజయాలు సాధించిన విద్యార్థులు తమకు ఉపయోగపడిన పుస్తకాలను గ్రంథాలయాలకు విరాళంగా అందించి , భావితర విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తుమ్మా ధరణి కుమార్,జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు , సిబ్బంది ఇతర ప్రముఖులు పాల్గొన్నారు .

## స్త్రీనిధి లావాదేవీలు డిజిటల్ పద్ధతిలోనే జరగాలి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెంది, తమ ఆదాయాన్ని పెంచుకునేలా సకాలంలో రుణాలను అందిస్తూ, నూరు శాతం రికవరీ సాధించేలా స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్త్రీ నిధి కమిటీ సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేకుండా పరస్పరం అందుబాటులో ఉంటూ మహిళా సంఘాలను బలోపేతం చేయాలని అన్నారు. రుణాల పంపిణీ, రికవరీ ప్రక్రియలో వెనుకబడిన సిబ్బంది పనితీరును అదనపు కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. వచ్చే నెల నాటికి రికవరీ శాతం ఖచ్చితంగా 60 శాతానికి చేరాలని, రాబోయే సమావేశంలో ప్రగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని అన్నారు.

**'మన స్త్రీ నిధి' యాప్ ద్వారానే రికవరీ**

స్త్రీ నిధి రుణ రికవరీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా సాగడానికి, నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా ఉండేందుకు రికవరీ మొత్తాన్ని పూర్తిగా 'మన స్త్రీ నిధి' యాప్ ద్వారానే సేకరించాలని ఆదేశించారు. యాప్‌పై ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం పట్టణాలలో వార్డుల వారీగా, గ్రామాల్లో వీఓ ల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మహిళల మొబైల్స్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయించి, రికవరీ చేసే విధానాన్ని డెమో పద్ధతిలో వివరంగా వివరించాలని సిబ్బందిని ఆదేశించారు.
ఈ సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీరామ్, రవీందర్ నాయక్, మెప్మా డీఎంసీ, ఏడీఎంసీ, టీఎంసీ, టీఎల్‌ఎఫ్ మెప్మా సిబ్బంది, ఏపీఎంలు, స్త్రీ నిధి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారంపై తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు ప్రమాదకరంగా మారిన లూజు విద్యుత్ వైర్లను గుర్తించి పకడ్బందీగా సరిచేయాలని ఆదేశించారు.నియోజకవర్గంలోని అన్ని సబ్‌స్టేషన్లను అవసరమైన మరమ్మతులు చేపట్టి, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న విద్యుత్ కనెక్షన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రైతులు రూ.9,100 ప్రభుత్వానికి చెల్లిస్తే ఒక కిలోమీటరు వరకు విద్యుత్ వైరు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఈ పథకాన్ని అర్హులైన రైతులు వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకొని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు తక్షణమే స్పందించాలన్నారు. అదేవిధంగా విద్యుత్ అవసరాలు దృష్టిలో ఉంచుకొని 132 కెవి సబ్ స్టేషన్ లో ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ రవి ప్రసాద్, డీఈ సూర్య నాయక్, ఏడీ శంకర్ నాయక్, వివిధ మండలాల ఏఈలు, ప్రజా ప్రతినిధులు, తాండూర్ పట్టణ కౌన్సిలర్లు, వివిధ మండలాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 29.07.2026
www.mudranews.in | @mudranews



### షుగర్ వల్ల ఆరోగ్యకరమైన జీవనశైలి

"సమతుల ఆహారం, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక, ధూమపానం-మద్యానికి దూరంగా ఉండటం వల్ల నరాల ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలే ఉత్తమ రక్షణ."





# ఎల్లమ్మకు ఆషాడ బోనాలు

సిద్దిపేట శ్రీ మహారేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో ఆషాడ మాసం పురస్కరించుకొని శ్రీ రేణుక మాత గౌడ మహిళల ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించుకున్నారు. డప్పు చెప్పులు, శివసత్తుల నృత్యాలతో అంగరంగ వైభవంగా ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి, ఓడి బియ్యలు పోశారు. ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో బోనాలను ఘనంగా నిర్వహించడంతో పాటు విచ్చేసిన భక్తులందరికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కిశోర్ శర్మ, గౌడ మహిళ ప్రతినిధి రంగు కృష్ణవేణి, సంఘం అధ్యక్షులు పల్లె లాల్ బహిదూర్ గౌడ్, ఉపాధ్యక్షులు మార్క శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లె బాలకిషన్ గౌడ్, కోశాధికారి గాదగోని కిష్టయ్య గౌడ్, డైరెక్టర్లు పల్లె సునీల్ గౌడ్, గాదగోని ప్రకాష్ గౌడ్, గాదగోని సత్యం గౌడ్, పల్లె చంద్రశేఖర్, బాలగొని సంతోష్ తదితరులు పాల్గొన్నారు. - ముద్ర ప్రతినిధి, సిద్దిపేట

## సర్ ను వంద శాతం పూర్తిచేస్తే ప్రోత్సాహకం

బిఎల్ఏలకు దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే డా.రోహిత్




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) సూచించారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ సమీక్ష సమావేశం డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేసిన బీఎల్ఏలకు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పారదర్శకంగా,తప్పులు లేకుండా సర్వే చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ ఛైర్మన్ నరేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, బూత్ లెవెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ కళాకారులకు ఐడీ కార్డులు, ఉపాధి కల్పించాలి

సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** నిరుద్యోగ కళాకారులకు భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ఐడి కార్డులు జారీ చేయడంతో పాటు, వచ్చే నెల 22న నిర్వహించనున్న జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా జిల్లా దేవస్థానాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పించాలని ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం డిమాండ్ చేసింది.రాష్ట్ర కమిటీ చైర్మన్ అన్వోజు వెంకటేశం,రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్నపిలుపు మేరకు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాకారులు జిల్లా డిపిఆర్వోను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ జానపద కళాకారులను గుర్తించి భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ఐడి కార్డులు అందజేయాలని, ఆగస్టు 22న జరిగే జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా దేవస్థానాలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు పుల్లూరు శ్రీనివాస్, పిల్లిట్ల బుజంగం, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, ఉపాధ్యక్షులు తునికి రాజు, పాకాల భూపతి, ప్రధాన కార్యదర్శి చిన్నగుండవెల్లి పరమేష్, ప్రచార కార్యదర్శి రాజు చిన్నగుండవెల్లి, సంయుక్త కార్యదర్శులు ధనరేఖ, బొల్లం రాజేష్, కోశాధికారి రాజు కందకట్ల, సలహాదారులు పిల్లిట్ల శశిధర్, ఇనుప సురేష్, కమిటీ సభ్యులు ఐరేని రేణుక, బోడ భాగ్య, సూర్యావంశీ విధుమౌళి, బిక్షపతి తదితర నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు.

## 7న అఖిల భారత ఓబీసీ మహాసభను జయప్రదం చేయండి




**ముద్ర, హైదరాబాద్:** బీసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం ఆగస్టు 7న నిర్వహించనున్న అఖిల భారత OBC మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ మహాసభకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ ఉద్యోగులపై అమలవుతున్న క్రిమిలేయర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగం బీసీలకు కల్పించిన రిజర్వేషన్ హక్కులు క్రమంగా నిర్వీర్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. EWS రిజర్వేషన్ల పేరుతో బీసీలకు రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలు, అలాగే మెడికల్, ఇంజినీరింగ్, ఐఐటీ తదితర ఉన్నత విద్యా సంస్థల్లో దక్కాల్సిన సీట్లు ఇతర వర్గాలకు మళ్లిపోతున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితిని బీసీ సమాజం తీవ్రంగా పరిగణించాలని, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత పోరాటమే మార్గమని స్పష్టం చేశారు.బీసీల రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగ హక్కుల సాధనకు అఖిల భారత OBC మహాసభ ఒక చారిత్రాత్మక వేదికగా నిలవబోతోందని పేర్కొన్నారు. అందువల్ల తెలంగాణ నలుమూలల నుంచి బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. దేశబోయిన రమ మాట్లాడుతూ, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ అమలు చేయడం సామాజిక న్యాయానికి అనివార్యమని పేర్కొన్నారు. బీసీ మహిళా ఉద్యోగులు, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో మహాసభకు హాజరై బీసీల హక్కుల ఉద్యమానికి తమ మద్దతు తెలియజేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం అడ్వైజర్ సుంకరి శ్రీనివాస్, ట్రెజరర్ శ్రీకాంత్, అసోసియేట్ ప్రెసిడెంట్ వారాల శ్రీనివాస్, రామరాజు, వైస్ ప్రెసిడెంట్ రాసూరి జ్ఞానేశ్వర్, జగన్, మహేంద్ర సాగర్, షమీమ్ సుల్తానా, మహిళా ఉద్యోగుల సంఘం కార్యదర్శి జ్యోతి శీలం, మంజులత, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు పాటుపడాలి

జిల్లా కలెక్టర్ హైమావతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ఉపాధ్యాయుల వృత్తి ధర్మం పాటిస్తూ, విద్యార్థుల అభివృద్ధి కోసం నైతిక విలువలు, బాధ్యతలు, వృత్తిపరమైన ప్రమాణాలను పాటించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయుల పని తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ రిజిస్టర్ లో సంతకం చేయకుండా మధ్యాహ్న సమయంలో పలువురు ఉపాధ్యాయులు ఇంటికి వెళ్ళడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. రోజు ఇలాగే చేస్తున్నారా అంటూ ప్రిన్సిపల్ తో ఆరా తీశారు. టీచర్ డైరీ తనికి చేస్తూ టీచర్ డైరీ రాయకుండా టీచర్ డ్యూటీ చేస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీచర్ లను చూస్తుంటే విద్యార్థులకు పాఠాలు సక్రమంగా బోధిస్తున్నారా అని తరగతి



గదిలోకి వెళ్ళి విద్యార్థులతో ఆరా తీశారు. ప్రిన్సిపల్ కు ఉపాధ్యాయులు, మిగతా సిబ్బంది వినకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరు విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉందని డీఈఓ రమేష్ కి ఫోన్ చేసి పాఠశాలపై, ఉపాధ్యాయులు పనితీరు, విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాల గూర్చి విచారణ జరపాలని ఆదేశించారు.డీఈఓ సూచన మేరకు పాఠశాలకు విచ్చేసిన సెక్టోరియల్ అధికారి రామస్వామితో విద్యా సంవత్సరం నుండి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యాంశ బోధనా, ఉపాధ్యాయులు పని తీరు, టీచర్ డైరీ, లెస్సన్ ప్లాన్ ప్రతిదీ ఇంకో ఇద్దరు అధికారులను పిలుచుకుని పూర్తి విచారణ జరిపి సాయంత్రం లోగా తన వద్దకు తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.ఉపాధ్యాయులు తమ వృత్తి విలువలు, వృత్తి ధర్మాన్ని కాపాడాలని, ఉపాధ్యాయుల విధుల్లో అశ్రద్ధ అంటే, విద్యార్థుల విద్య, భద్రత, పాఠశాల నిర్వహణ లేదా తమ అధికారిక బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం అనిసమయపాలన పాటించి, క్రమం తప్పకుండా పాఠాలు బోధించాలి. పాఠాలను నాణ్యంగా బోధించి, విద్యార్థుల్లో జ్ఞానం, నైపుణ్యాలు మంచి విలువలను పెంపొందించాలి. విద్యార్థులకు ఆదర్శప్రాయమైన ప్రవర్తనను చూపాలి. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ప్రోత్సాహం ఇవ్వాలి. తల్లిదండ్రులు మరియు పాఠశాల యాజమాన్యంతో సమన్వయంగా పనిచేయాలి. నిరంతరం కొత్త బోధనా పద్ధతులు నేర్చుకుంటూ తన వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

## వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య



**ముద్ర, కూకట్‌పల్లి:** అత్తింటివారి వేధింపులు భరించలేక హైమవతి (29) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కల్కాల్ గ్రామానికి చెందిన హైమవతికి, కేపీహెచ్‌బీ హైదర్‌నగర్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌తో 2019 ఫిబ్రవరి 28న వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు వయసు 7 మరియు 5 సంవత్సరాలు ఉన్నారు.పెళ్లయినప్పటి నుంచి భర్త శ్రీకాంత్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు తల్లి లక్ష్మి, తండ్రి శ్రీరాములు, మరదలు ధరణి, ధరణి భర్త దానయ్య వేధింపులకు గురిచేశారు. గత నాలుగు సంవత్సరాలుగా మానసికంగా, శారీరకంగా తీవ్రంగా వేధిస్తూ వచ్చారు. సోమవారం రాత్రి శ్రీకాంత్ తన బావమరిది గణేష్‌కు ఫోన్ చేసి, మీ చెల్లిని తీసుకెళ్లమని, ఆమె తనకు వద్దు అని చెప్పాడు. ఆ సమయంలో హైమవతి తన కుటుంబాన్ని ఫోన్‌లో సంప్రదించి, తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని కన్నీటిపర్యంతమైంది. మంగళవారం ఉదయం 07:20 గంటల ప్రాంతంలో హైమవతి గది తలుపులు తీయడంలేదని శ్రీకాంత్ సమాచారం ఇవ్వడంతో.. ఆమె తమ్ముడు గణేష్ వెంటనే అక్కడికి చేరుకొని స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా, అప్పటికే ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ విగత జీవిగా కనిపించింది.అత్తింటివారి వేధింపుల కారణంగానే తన కూతురు బలవన్మరణానికి పాల్పడిందని తల్లి లలిత వాపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఇంకా బీఆర్ఎస్ నీడలోనే మున్సిపల్ అధికారులు

సిద్దిపేటలో ఇండ్లు కట్టాలంటే సమర్పించాల్సిందే
హరీశ్ రావు మీ కౌన్సిలర్లకు ఇదే నేర్పరా....?
వాట్సప్ ఆడియో, వీడియో పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం
కాంగ్రెస్ నాయకుడు సాకి ఆనంద్




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట మున్సిపల్ పాలక వర్గం సమయం ముగిసిన సిద్దిపేట మున్సిపల్ అధికారులు బి ఆర్ ఎస్ ఇంకా వారి నీడలోనే నిద్రిస్తున్నరని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాకి ఆనంద్, మాజీ కౌన్సిలర్లు ఎల్లం, రియాజ్, తదితరులు మండిపడ్డారు. రెండూ రోజులుగా వాట్సప్ లో చక్కర్లు కొడుతున్న ఆడియో వారి బి ఆర్ ఎస్ కౌన్సిలర్ల వైనీతికి నిదర్శనం అన్నారు. డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారంi సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత మున్సిపల్ పాలకులు అమాయకుల వద్ద డబ్బులు వసూలు చేయడం సిగ్గు చెటన్నారు. పేదోళ్లు ఇల్లు కొట్టు కోవడం కోసం అనుమతులకు వస్తే గత చైర్మన్ మంజుల రాజనర్సు అండదండలతో బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు గత పదేళ్ల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ప్రస్తుతం పాలకుల సమయం అయిపోయిన వసూళ్లు మాత్రం ఆగడం లేదని అన్నారు. దాదాపు 9 లక్షల రూపాయలు తీసుకున్నట్టు వీడియో, ఆడియో లీక్ అయ్యిన మాట 100% వాస్తవం అన్నారు. 2005 నుండి రాజనర్సు తమ కౌన్సిలర్లకు ఇదేనా నేర్పింది అని ప్రశ్నించారు.. సిద్దిపేట అభివృద్ధి పేరిట హరీశ్ రావు కౌన్సిలర్లకు నేర్పింది కూడా ఇదేనా అన్నారు. ఈ విషయం పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పతకాలతో ప్రజల్లో దూసుకెలుతుందని అన్నారు.ఈ సమావేశం లో నాయకులు గుండు రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలి

**ముద్ర, కూకట్‌పల్లి :** డివిజన్ పరిధిలోని స్థానిక దళిత సంఘాల నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కూకట్‌పల్లి ప్రాంతంలోని భూదాన్ బోర్డు భూమి ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐడీపీఎల్ ఆధీనంలో ఉందని, ఈ భూమిని ఇల్లు లేని నిరుపేద దళిత కుటుంబాలకు ఇంటి స్థలాలుగా కేటాయించాలని వారు కోరారు. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపత్రాన్ని స్వీకరించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు దళిత సంఘాల సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. ఈ అంశాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత కేంద్ర శాఖలతో చర్చించి, భూదాన్ బోర్డు భూమి సమస్య పరిష్కారానికి తన వంతు



కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నాయకులు, స్థానిక సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555